స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

RNI No: TELTEL/2024/86684

శనివారం | 29.03.2025 | సంపుటి : 2 | సంచిక :57 | పేజీలు : 8 | వెల : 2/-



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575




## భావ ప్రకటనా స్వేచ్ఛను

# రక్షించడం కోర్టుల విధి

- అది ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది
- కాంగ్రెస్ ఎంపీ వీడియో కేసులో సుప్రీం వ్యాఖ్యలు

06

కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది.

## సోమవారం ప్రత్యేక

# క్లియరింగ్ సెషన్

### బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం




02



02

# మళ్లీ పెరిగిన బంగారం ధర

### ఏడాదిలో 35% జంప్

# మయన్మార్, థాయ్‌లాండ్

# అతలాకుతలం

## భారీ భూకంపంతో కండ్లముందే కుప్పకూలిన వేలాది భవనాలు

- మయన్మార్‌లో 7.7, థాయ్‌లో 7.4 రిక్టర్ స్కేల్ నమోదు
- ప్రాణ భయంతో పరుగులుతీసిన జనం
- శిథిలాల చిక్కుకుపోయిన వేలాది మంది
- థాయ్‌లాండ్‌లో అత్యవసర పరిస్థితి విధింపు
- సహాయక కార్యక్రమాల్లోకి దిగిన ఆర్మీ సిబ్బంది
- భారత్‌లోనూ పలుచోట్ల భూ ప్రకంపనలు
- మేఘాలయాలో రిక్టర్ స్కేల్‌పై 4.4 గా నమోదు



మయన్మార్, థాయ్‌లాండ్ దేశాల్లో శుక్రవారం భారీ భూకంపాలు సంభవించించాయి. నిమిషాల వ్యవధిలో రెండు సార్లు వచ్చిన భూకంపానికి ఆ దేశాలు చిగురుటాకులా వణికిపోయాయి. ముందుగా మయన్మార్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదైంది. ఆ తర్వాత భూకంప తీవ్రత 6.4గా నమోదైంది. సెంట్రల్ మయన్మార్‌లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. ఈ భూకంపం ధాటికి పలు భవనాలు ఊగిపోయాయి. మయన్మార్‌లోని మాండలేలోని ఐకానిక్ అవా వంతెన కుప్ప కూలింది. ఇరావడీ నదిలోకి వంతెన కూలిపోయిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మయన్మార్‌లో విమాన, రైలు సర్వీసులన్నీ నిలిపివేశారు. సహాయక కార్యక్రమాల కోసం సైన్యాన్ని రంగంలోకి దింపారు. భూకంప సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని ఆ దేశ అధినేతలు కోరారు.

**న్యూఢిల్లీ, మార్చి 28 :** తాజా భూకంపం తీవ్రతకు మయన్మార్, థాయ్‌లాండ్ అతలాకుతలమయ్యింది. అనేక భవనాలు కుప్పకూలాయి. మయన్మార్ దేశవ్యాప్తంగా చాలా చోట్ల భవనాలు, పాత వంతెనలు కుప్పకూలినట్లు వార్తలొస్తున్నాయి. ఇందులో ఓ వేయి పడకల ఆస్పత్రి కూడా ఉందన్న వార్త ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనలో ఎవరైనా మరణించిందీ, ఎంతమంది గాయపడ్డదీ తెలియాల్సి ఉంది. శిథిలాల కింద ఎందరున్నారన్న దానిపై ఆరా తీస్తున్నారు. సహాయక చర్యలు సాగుతున్నాయి. క్షతగాత్రుల సంఖ్య అధికంగానే ఇక్కడే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఇక్కడ అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఓ ఆంగ్లవార్తా సంస్థ కూడా పేర్కొంది. చాలా మంది తమ ఆత్మీయుల కోసం శిథిలాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. నేపిడాలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న ఆసుపత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్ లయాంగ్ సందర్శించారు. శుక్రవారం ఉదయం మయన్మార్, థాయ్‌ల్యాండ్ సహా చైనా, భారత్, వియత్నాం తూర్పు ఆసియా దేశాల్లో 7.7, 6.4 తీవ్రతతో రెండు భూకంపాలొచ్చాయి. ఫలితంగా థాయ్‌ల్యాండ్, మయన్మార్‌లో భారీగా ఆస్తినష్టం సంభవించిది. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

మిగతా 2 లో

## అర్హులందరికీ

# రేషన్ కార్డులు

- సన్నబియ్యం వాగ్దానానికి కట్టుబడి ఉన్నాం
- రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి



**నల్లగొండ, మార్చి 28 :** అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

మిగతా 2 లో



04


## మళ్లీ పెరగనున్న

# మెట్రో చార్జీలు

కేంద్రం అనుమతి కోరేందుకు ప్రయత్నాలు

## ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో

# మరో మృతదేహం




04



04

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

వచ్చే నెలలో థాయిలాండ్, శ్రీలంక షెడ్యూల్



03

బెట్టింగ్ యాప్స్‌కు నిర్మూలనకు..

# సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకి

# జాతీయ హెూదా ఇవ్వలేం

తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం



03

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు

# 2శాతం డీఏ పెంపు

కేబినెట్ ఆమోదిస్తూ తీర్మానం

03



# ఇక టూవీలర్‌దారులకు రెండు హెల్మెట్లు

బండి కొనేప్పుడే అంటగట్టే ఆలోచన

03

# శనగ రైతులకు కేంద్రం ఊరట

దిగుమతులపై 10శాతం సుంకం విధింపు



02

## కాంగ్రెస్ విధానాలతో

# కుప్పకూలిన రియల్ రంగం

ట్విట్టర్ వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు



02

## సంగారెడ్డి జిల్లాలో

# విషాద ఘటనలు

- అనుమానాస్పద స్థితిలో ముగ్గురు చిన్నారుల మృతి
- మరో ఘటనలో బావిలో పడి ఇద్దరు కార్మికుల దుర్మరణం

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## ఎస్ఎల్‌బిసి వద్ద కొనసాగుతున్న సహాయకచర్యలు

### చనిపోయిన వారి ఆచూకీ కోసం నిరంతరంగా శ్రమ

**నాగర్‌కర్నూల్, మార్చి 28 :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. సొరంగం లోపల జరుగుతున్న సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్న సహాయక బృందాల సహాయక చర్యలపై అభినందిస్తూ, రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. జీఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారీ కేడింగ్ చేసినట్లు, జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యవేక్షణ జరుపుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యలలో భాగంగా సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు, తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ, ఎప్పటికప్పుడు ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్‌ను బయటకు తీసేందుకు, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో చర్యలు వేగవంతం చేస్తున్నాయన్నారు. ప్రమాద ప్రదేశం సమీపంలో ఉన్న పెద్దపెద్ద బండరాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్‌తో కట్ చేస్తూ వాటి భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకు వస్తున్నట్లు తెలిపారు. తవ్వకాల ద్వారా తీస్తున్న మట్టిని కన్వేయర్ బెల్ట్ గుండా బయటకు తరలిస్తున్నట్లు, ప్రమాద ప్రదేశ సమీపం వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, జీఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచిపోయేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభ

### బిఆర్ఎస్ నేతలు వినోద్ తదితరుల వెల్లడి

**హన్మకొండ, మార్చి 28 :** హనుమకొండలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని మాజీ ఎంపి వినోద్ కుమా÷- అన్నారు. సభ ఏర్పాట్లపై బీఆర్ఎస్ నేతలు మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఎల్కతుర్తిలో జరగబోయే రజతోత్సవ సభ కొత్త తరానికి కొత్త ఆలోచనలు కలిగించే వేదికగా మారుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలిపిన ఘనత బీఆర్ఎస్‌దే అని పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్‌పై విమర్శలు చేశాయని, అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటికన్నా ప్రత్యేకమని అన్నారు. మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, 25 వసంతాల పండుగకు లక్షలాది మంది ప్రజలు హాజరుకానున్నారని, ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా మారనుందని చెప్పారు. కేసీఆర్ స్పెషల్ ఆదేశాల మేరకు సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు- పూర్తి చేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ 25 వసంతాల పండుగను వరంగల్‌లో జరపడం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల వసతులు అందించాలని కేసీఆర్ ఆదేశించారని తెలిపారు. ఈ సభ కోసం విశాల స్థలాన్ని కేటాయించామని, సభ నిర్వహణ కోసం రైతులు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సభతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులు చోటు-చేసుకుంటాయని నేతలు అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్ విధానాలతో కుప్పకూలిన రియల్ రంగం

### ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, మార్చి 28 :** నగర అభివృద్ధి, రియల్ ఎస్టేట్ పరిస్థితి, ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో నగరం సౌభాగ్యంగా ఎదిగిందని, కానీ 15 నెలల కాంగ్రెస్ పాలనలో అభాగ్యంగా మారిందని విమర్శించారు. హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీసిందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలోని రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా కుంచించుకుపోయిందని తెలిపారు. పేదల ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్న ప్రభుత్వం, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు చేస్తోందని విమర్శించారు. గత త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు 49శాతం తగ్గాయని, ఆఫీస్ లీజింగ్ రంగం 41శాతం క్షీణించిందని గణాంకాలతో తెలిపారు. వ్యవసాయ రంగంలో మాత్రమే కాదు, రియల్ వ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా మారిందని, కాంగ్రెస్ పాలనలో వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షం గా హితబోధ చేశారు. కూల్చడం కంటే కట్టడాన్ని నేర్చుకోవాలని, అబద్దాల కన్నా అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు. 'జాగో తెలంగాణ జాగో!' అంటూ తెలంగాణ ప్రజలను అప్రమత్తం చేశారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి, హైదరాబాద్ నగరాభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై కేటీఆర్ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## బివైడీ కార్ల సంస్థ రావడం ఆనందదాయకం

### బిఆర్ఎస్ కృషి వల్లనే సాధ్యమయ్యిందన్న కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 28 :** రాష్ట్రానికి బీవైడీ కార్ల సంస్థ పెట్టుబడి రావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్లే రాష్ట్రానికి బీవైడీ సంస్థ వచ్చిందన్నారు. 2023లోనే 10 బిలియన్ డాలర్ల పెట్టు-బడికి బీవైడీ, ఒలెక్ట్రా అంగీకారం కుదుర్చు కున్నాయని చెప్పారు. బీవైడీ కంపెనీ రాష్ట్రానికి రావడం ఫార్ములా-ఈ రేసు ప్రత్యక్షఫలితమని వెల్లడించారు. బీవైడీ రాకకు ఏండ్ల తరబడి కష్టపడిన అందరికి ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితోనే తెలంగాణకు బీవైడీ సంస్థ వచ్చింది. నాడు బీఆర్ఎస్ చేసిన కృషి.. నేడు ఫలితించింది. దిగ్గజ కంపెనీ భారీ పెట్టు-బడితో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఫార్ములా ఈ రేసు నిర్వహణతో ప్రపంచం దృష్టిని తెలంగాణ ఆకర్షించింది. ప్రభుత్వాలు మంచి విధానాలు ప్రవేశపెడితే నీఛమైన రాజకీయాలను అధిగమించి మంచి ఫలితాలు వస్తాయి. తాము ప్రవేశపెట్టిన తెలంగాణ మొబిలిటీ వ్యాలీ, ఈవీ విధానం వల్లే ఈ రోజు బీవైడీ తెలంగాణకు వచ్చింది. తెలంగాణ మొబిలిటీ- వ్యాలీ, ఈవీ పాలసీ భాగంగానే ఫార్ములా ఈ రేస్‌ను నిర్వహించాం. తమ విధానాల వల్లే తెలంగాణకు ఇంత భారీ పెట్టుబడి వచ్చింది. ఈ పెట్టు-బడి కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మయన్మార్, థాయ్‌లాండ్ అతలాకుతలం

(మొదటిపేజీ తరువాయి)

మాండలే అనే ప్రదేశంలో మసీదు కూలి దాదాపు 20 మంది చనిపోగా.. టవుంగూలో పునరావాస కేంద్రం ధ్వంసమై మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఆ దేశ స్టాక్ ఎక్స్ఛేంజి కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ఇక తొలిసారి ప్రకంపనలు రాగానే బ్యాంకాక్‌లో మెట్రో సేవలను నిలిపివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది. రెండోసారి ప్రకంపనలకు ఏకాంగా మెట్రో రైళ్లు కూడా ఊగిపోయాయి. చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో కూడా తీవ్ర స్థాయిలోనే భూకంపం వచ్చింది. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటు-







చేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సమాజం సాయం అందించాలని మయన్మార్‌లోని సైనిక పాలకులు కోరారు. దేశ వ్యాప్తంగా అత్యవసర పరిస్థితి ప్రకటించింది. భూకంపం కారణంగా బ్యాంకాక్‌లో ఇద్దరు చనిపోయారు. నగరంలో కుప్పకూలిన 30 అంతస్తుల భారీ భవనం కింద 43 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల కోసం దీనిని నిర్మిస్తున్నారు.

### భూకంపం తాకిడికి 167 మంది దుర్మరణం

మయన్మార్, థాయిలాండ్ దేశాలు శుక్రవారం భారీ భూకంపం తాకిడికి విలవిలలాడాయి. రిక్టర్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.7గా నమోదైంది. భూకంపం ధాటికి మయన్మార్‌లో 167 మంది మరణించారని, 300 మందికిపైగా గాయపడ్డారని తెలుస్తోంది. అయితే సహాయక చర్యల్లో భాగంగా శిథిలాలను తొలగిస్తున్నారు. దీంతో మరికొందరు వాటికింద ఉండే అనుమానం ఉందని భావిస్తున్నారు. భారీ భవనాలు నేలమట్టం కాగా, శిథిలాల కింద వందలాది మంది చిక్కుకున్నట్లు వార్తా కథనాలు వెలువడతున్నాయి. జనం వీధుల్లో, రోడ్లపైనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న ఒక ఎత్తైన భవనం కుప్పకూలినప్పుడు కనీసం ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందగా, 90 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. సహాయక సిబ్బంది ఇప్పటి వరకు ఏడుగురిని కాపాడారు. మయన్మార్‌లోనే నిమిషాల వ్యవధిలో ఆరు భూకంపాలు సంభవించాయి. ఈ భూకంపం ప్రభావంతో భారత్, చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లలో కూడా భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే ఆయా దేశాల్లో భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4వరకు పరిమితం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. మయన్మార్ రాజధాని నేపిడా, మాండలే సహా ఆరు ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఎమర్జన్సీ ప్రకటించారు. భూప్రకంపల ప్రభావంతో రెండవ పెద్ద నగరం మాండలేలో ఐకానిక్ వంతెన కుప్ప కూలిపోయింది. నగరంలో భూప్రకంపన తీవ్రత 6.4గా నమోదైంది. భవనం కుప్పకూలినప్పుడు దుమ్ము ధూళి వ్యాపించగా, జనం భయంతో కేకలు వేస్తూ పరుగులు తీయడం కనిపించింది. భూకంపం ధాటికి భవనాలు అటూ ఇటూ ఊగిపోవడంతో జనం రోడ్లపైకి పరుగులు పెట్టారు. భారీ భవంతులపైన ఉన్న స్విమ్మింగ్ పూల్స్ నుంచి జలధారలు కిందికి రావడం కనిపించింది. పలు చోట్ల శిథిలాల నుంచి రక్షించమని ఆర్తనాదాలు వినిపించాయి. బ్యాంకాక్‌లో ఇతర ప్రదేశాల్లో తమ భవనాల్లో నుంచి ఖాళీ చేయించిన ప్రజలను దూరంగా ఉండవలసిందని హెచ్చరించారు

# సంగారెడ్డి జిల్లాలో విషాద ఘటనలు

- అనుమానాస్పద స్థితిలో ముగ్గురు చిన్నారుల మృతి
- మరో ఘటనలో బావిలో పడి ఇద్దరు కార్మికుల దుర్మరణం


**సంగారెడ్డి, మార్చి 28 :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. అలాగే ఇద్దరు వలసకార్మికులు అనుమానాస్పద స్థితిలో బావిలో పడి చనిపోయారు. ఈ సంఘటన కోహీర్ మండలం పైడిగుమ్మల్ లో విషాదం చోటు చేసుకుంది. ఇకపోతే పిల్లల మృతి ఘటనలో వారి తల్లి రజిత తీవ్రమైన కడుపునొప్పితో స్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అనుమానాస్పదంగా ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో స్థానికులు కంటతడిపెట్టారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ(10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో



స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పొట్టకూటి కోసం వచ్చిన ఇద్దరు వలస కార్మికులు బావిలో పడిపోయి చనిపోయారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతి చెందిన ఇద్దరు యూపీ, ఒడిశాకు చెందిన బైద్యనాథ్ భట్ (25), హరిసింగ్ మజ్‌హీ(30)గా గుర్తించారు. పైడిగుమ్మల్ లో వెంచర్ పనులకు వచ్చి ఇద్దరు కార్మికులు మార్చి 10న అదృశ్యమైనట్లు చెప్పారు. మార్చి 13న కోహీర్ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యంపై ఫిర్యాదు వచ్చినట్టు చెప్పారు. పైడిగుమ్మల్ గ్రామానికి వచ్చి తిరిగి పని ప్రదేశానికి వెళ్తూ దారితప్పి బావిలో పడిపోయినట్లు పోలీసుల అనుమానిస్తున్నారు. మార్చి 27న రాత్రి వ్యవసాయ బావిలో మృతదేహాలను గుర్తించారు పోలీసులు. మృతదేహాలను బావిలో నుంచి వెలికితీసి పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు కోహీర్ పోలీసులు.

# వరిలో సన్నరకాల విత్తనాలు ఎక్కువగా అందుబాటులోకి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్:** వచ్చే వానాకాలం సీజన్‌కు అన్ని రకాలుగా సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 'వరిలో సన్న రకాల సాగు ఈ సారి ఇంకా పెరిగే అవకాశమున్నందున ఆ విత్తనాలను ఎక్కువగా అందుబాటులోకి తెస్తాం. గత అనుభవాల దృష్ట్యా డిమాండ్ ఉన్న రకాలపై ప్రత్యేక దృష్టి సారించండి. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలలో లేబుల్ లేకుండా విత్తనాలు అమ్మే వారిని నియంత్రించాలి' అని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు చేదోడుగా ఉండేందుకు అవసరమైన సన్నద్ధతపై శుక్రవారం ఆయన సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. "వచ్చే సీజన్‌కు 16.70 లక్షల క్వింటాళ్ల వరి, 48 వేల క్వింటాళ్ల మొక్కజొన్న, 1.35 లక్షల క్వింటాళ్ల సోయాచిక్కుడు విత్తనాలు కావాలి. 89 లక్షల పత్తి ప్యాకెట్లు అవసరం కాగా 2.4 కోట్ల ప్యాకెట్లు నిల్వ చేస్తాం. పచ్చిరొట్ట విత్తనాలను వచ్చే మాసంలోనే సరఫరా చేస్తాం. ఇప్పటికే 1.94 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపాం" అని మంత్రి వివరించారు. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం: "విత్తన కంపెనీలకు, విత్తనోత్పత్తి చేస్తున్న రైతులకు మధ్య వారధిగా ఉన్న ఆర్గనైజర్లలో కొంతమంది... కర్షకులను ఇబ్బందులు పెడుతున్నారు. దక్కాల్సిన ధరను ఇవ్వకుండా, డబ్బులు చెల్లించకుండా రైతులను వేధిస్తున్నారు. ఇకముందు ఎక్కడైనా ఇటువంటి ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం ఆయా కంపెనీల పట్ల కఠినంగా వ్యవహరిస్తుంది" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆర్గానిక్ పద్ధతిలో రైతులు పసుపు పండించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీశ్రీకి మంత్రి తుమ్మల సూచించారు. శుక్రవారం ఆమె ఇక్కడ మంత్రిని కలిశారు. "ఆర్గానిక్ పద్ధతిలో పసుపు పండిస్తే ఎగుమతి చేసేందుకు కూడా అనువుగా ఉంటుంది. పసుపు ఆధారిత ఉప ఉత్పత్తులను తయారుచేసే పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి" అని మంత్రి ఆమెకు సూచించారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. అందుకే సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఆదిలాబాద్ మెడికల్ ఆఫీసర్

**ఆదిలాబాద్, మార్చి 28 :** ఓ మెడికల్ షాపు నిర్వాహకుడి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ జిల్లా ఎక్‌స్టె-న్షన్ మెడికల్ అధికారి రవిశంకర్ ఏసీబీకి పట్టుబడ్డారు. మాస్ మీడియా అధికారిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ఆయన గుడిహత్నూరు మండలం మన్నూరు గ్రామంలో మూడు రోజుల క్రితం ఓ మైనర్ బాలిక అబార్షన్ విషయంలో తన మెడికల్ షాపు నుంచే మందులు సరఫరా అయ్యాయని అనుమానాలు వ్యక్తం చేస్తూ స్థానికంగా ఉన్న ఓ మెడికల్ షాపును తనిఖీ చేశారు. ఈ కేసులో తన పేరు లేకుండా ఉండాలంటే రూ. 30 వేలు ఇవ్వాలని షాపు నిర్వాహకుడిని డిమాండ్ చేశాడు. అధికారి అడిగిన ప్రకారం లంచం ఇచ్చేందుకు ఒప్పుకున్న షాపు నిర్వాహకుడు శుక్రవారం డీఎంహెచ్ కార్యాలయంలో ఆ మొత్తం ఇచ్చేందుకు వెళ్లాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రవిశంకర్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని మాస్ మీడియా అధికారి చాంబర్లో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధర..

**ఢిల్లీ:** బంగారం ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పుత్తడి రూ.1100 పెరిగి రూ.92,150కి చేరింది. అంతర్జాతీయంగా పసిడికి నెలకొన్న డిమాండ్‌తో దేశీయంగానూ దీని ధర పెరిగిందని ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. హైదరాబాద్‌లోనూ 10 గ్రాముల పసిడి ధర రూ.92 వేలు పలుకుతోందని బులియన్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పసిడి ధర దాదాపు 35 శాతం మేర పెరగడం గమనార్హం. గతేడాది ఏప్రిల్ 1న 10 గ్రాముల పసిడి ధర రూ.68,420గా ఉండగా.. ఏడాది వ్యవధిలో దాదాపు రూ.23,730 పెరిగింది. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు, తద్వారా వృద్ధికి ఆటంకం ఏర్పడుతుందన్న ఆందోళనలు పసిడికి డిమాండ్ పెంచుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. దీంతో సరికొత్త రికార్డులను నమోదు చేస్తోందన్నారు. అంతర్జాతీయంగా స్పాట్ గోల్డ్ శుక్రవారం ఔన్సు గరిష్ఠంగా 3086 డాలర్ల స్థాయికి చేరింది. మరోవైపు వెండి సైతం కిలోకు రూ.1300 మేర పెరిగి రూ.1.03 లక్షలకు చేరింది. అమెరికాకు సంబంధించి వ్యక్తిగత వినియోగ ఖర్చుల డేటా కొన్ని గంటల్లో విడుదల కానుంది. దీని ఆధారంగా ఫెడ్ తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉండడంతో మదుపర్లు దీనిపై దృష్టా సారించే అవకాశం ఉటుందని అనలిస్టులు చెబుతున్నారు.

## సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్..

### బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం

ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న వేళ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు జారీ చేసింది. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆ రోజు నిర్వహి ంచే ప్రత్యేక క్లియరింగ్ కార్యకలాపాల్లో అన్ని బ్యాంకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజే ప్రభుత్వ ఆదాయం, చెల్లింపులు పూర్తవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆ లావాదేవీలు నిర్వహించే బ్యాంకులు విధులు నిర్వర్తించేలా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఒక్క బ్యాంకులే కాదు.. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను విభాగం, సీజీఎస్టీ కార్యాలయాలు పనిచేయనున్నాయి. సోమవారం (31న) రంజాన్ ఉన్నప్పటికీ.. ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆయా కార్యాలయాలు పనిచేస్తాయి. పెండింగ్‌లో ఉన్న పన్ను సంబంధిత లావాదేవీలను చెల్లింపుదార్లు పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2శాతం డీఏ పెంపు

**కేబినెట్ ఆమోదిస్తూ తీర్మానం**

**న్యూఢిల్లీ, మార్చి 28 :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డియర్‌నెస్ అలవెన్స్ 2 శాతం పెంచింది. డీఏ పెంపు ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసింది. తాజా నిర్ణయంతో జూలై ఒకటి నుంచి చెల్లించాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. కేంద్రం నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు కోటిమందికిపైగా ఉద్యోగులకు లబ్ధి చేకూరనున్నది. ఇందులో 48లక్షల మంది ఉద్యోగులు, 67లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉద్యోగుల జీతభత్యాలు నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జూలైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జూలై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటు–ంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. గతేడాది అక్టోబర్‌లో దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.



## విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్, మార్చి 28 :** బెట్టింగ్ యాప్‌ల కేసులో నటి విష్ణుప్రియకు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మియాపూర్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ ఆమె హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారించింది. ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు.. అలాగే ఈ దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతేకాకుండా..ఈ కేసులో పోలీసులకు సహకరించాలని విష్ణు ప్రియను హైకోర్టు ఆదేశించింది. అలాగే చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం చేసిన పలువురు నటులు, ఇన్‌ఫ్లూయన్సర్లపై మియాపూర్‌తోపాటు పంజాగుట్ట పోలీసులు పలు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారి స్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. బెయిల్ పొందేందుకు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.



## బెట్టింగ్ యాప్స్‌కు నిర్మూలనకు.. సజ్జనార్‌కు కీలక బాధ్యతలు

**హైదరాబాద్, మార్చి 28 :** బెట్టింగ్ భూతాన్ని తరిమికొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కొందరు సెలబ్రిటీలను పోలీసులు విచారించారు. అయితే ఇలా చేయడం ద్వారా బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిర్మూలించ లేమని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్)ను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారు. ఈ క్రమంలో ఆర్టిసి ఎండి సజ్జనార్‌కు కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే టాక్ వినిపిస్తోంది. సిట్ గురించి అసెంబ్లీలో ప్రకటన చేసే ముందు సిఎం ఓ సమావేశం నిర్వహించారు. శాసనసభలోని ఆయన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, డిజి శివధర్ రెడ్డి, హైదరాబాద్ కమీషనర్ సివి ఆనంద్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్‌తో పాటు సజ్జనార్ కూడా పాల్గొన్నారు. దీంతో ఈ సిట్ ఏర్పాటులో సజ్జనార్‌కి కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి.

# కాలం చెల్లిన స్వీట్స్ రీ సైక్లింగ్

- మళ్లీ కొత్తగా స్వీట్స్ తయారీ
- మల్లాపూర్ అమన్ స్వీట్స్ షాప్‌పై దాడి
- లైసెన్స్ రద్దు చసి, షాపు సీజ్ చేసిన అధికారులు



**హైదరాబాద్, మార్చి 28 :** ప్రముఖ స్వీట్ షాపులో కూడా కల్తీ జరుగుతుందని విషయం ఇప్పుడు బయటపడింది.. ప్రముఖ స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నా తయారీ కేంద్రం పైన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. ఈ సోదాల్లో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. మల్లాపూర్ లోని అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం పైన ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. భయంకరమైన నిజాలతో వెంటనే దానిని సీజ్ చేయడం జరిగింది.. స్వీట్ షాపుల్లో మిగిలిపోయిన లేదా కాలం చెల్లిన స్వీట్స్ ని అన్నిటిని ఇక్కడికి చేర్చి వాటితో మళ్లీ కొత్త స్వీట్స్ తయారు చేసి అదే స్వీట్ షాప్ లోకి పంపిస్తున్నారు. కాలం చెల్లిన స్వీట్స్ ని రీసైకిల్ చేసి కొత్త స్వీట్స్ పై కొత్త లేబులింగ్ చేసి తిరిగి షాపుల్లోకి స్లపై చేస్తున్నారు.. దీంతో పాటు నాసిరకం వస్తువులను వాడుతున్నారు.. అపరిశుభ్రత మధ్యలో స్వీట్స్ ను తయారుచేసి స్లపై చేస్తున్నట్లు– ఫుడ్ సేఫ్టీ అధికారుల విచారణలో బయటపడింది ..దీంతో స్వీట్ షాపు స్వీట్ కర్మగారాన్ని వెంటనే అధికారులు సీజ్ చేశారు.. దాని లైసెన్సులు కూడా రద్దు చేస్తున్నట్లు– ప్రకటించారు. మల్లాపూర్ లో అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ దాడిలో, సరైన పరిశుభ్రత మరియు పారిశుధ్య నిర్వహణ లోపం, ఆహార పదార్థాల లేబులింగ్, రికార్డుల గడువు ముగిసిన ఆహార పదార్థాలను చూసి అవాక్కు అయ్యారు. గడువు ముగిసిన స్వీట్లను మళ్లీ కొత్త స్వీట్లు– తయారీలో వాడటన్ని, పరిశుభ్రత లేని ప్రదేశంలో తయారు చేయడం అధికారులు గుర్తించారు. వేరే జిల్లా లో తీసుకున్న లైసెన్సుతో మల్లాపూర్ లో పరిశ్రమను ఏర్పాటు చేయడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు క్యాన్సల్ చేస్తున్నామని తెలిపారు. శాంపిల్ ను సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నమని తెలిపారు.

# సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

- ఇది ప్రకృతి విధ్వంసకర చర్య మాత్రమే
- ట్విట్టర్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, మార్చి 28 :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే–గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

**పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, మార్చి 28 :** స్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ వ్యహహారంపై సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీ–విచారణ జరుపుతున్నందున ఈ దశలో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీని కేంద్ర నోటిఫై చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు కనిపించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో మరీ కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనిపై ఒకవైపు సీజేఐ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరుపుతుండగానే, అలహాబాద్ హైకోర్టుకు ఆయనను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారంనాడు నోటిఫై చేసింది. భారత రాజ్యాంగంలోని 222వ నిబంధనలోని క్లాజ్ వన్ ద్వారా రాష్ట్రపతి తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలాహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫారసు ఆమోదించారని ఆ ఉత్తర్వు తెలిపింది. జస్టిస్ వర్మ అలాహాబాద్ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించినట్టు పేర్కొంది. జస్టిస్ వర్మపై ఆరోపణల దుమారం నేపథ్యంలో ఆయనను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. అయితే ఈ నిర్ణయంతో అలబాహాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ విభేదించింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుతో సహా దేశంలోని ఏ కోర్టుకు బదిలీ చేయరాదని, ఆయనపై ఉన్న అభియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, అభిశంసన చేపట్టాలని, ఆయన పాత కేసుల్లో తీర్పులను కూడా తిరగదోడాలని హైకోర్ట్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

- అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, మార్చి 28 :** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా న్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్న దానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా ఇవ్వలేం

**తేల్చిచెప్పిన కేంద్ర ప్రభుత్వం**

**హైదరాబాద్, మార్చి 28 :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రజల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హెూదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## అభివృద్ధి తెలంగాణ కాస్త.. ఆత్మహత్యల తెలంగాణగా మారింది

**15 నెలల్లోనే రాష్ట్రం దివాలా : కేటీఆర్**



**వరంగల్, మార్చి 28 :** నాటి బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే... 15 నెలలకాలంలోనే రాష్ట్రం దివాలా తీసిందని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సౌభాగ్యనగరంగా ఉన్న హైదరా బాద్ కాంగ్రెస్ ఏలుబడిలో అభాగ్యనగరంగా మారిందన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలో ఇండ్ల కొనుగోళ్లు తగ్గాయని విమర్శించారు. అమ్మకాలు జరగకపోవడంతో రియల్టర్లు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. అన్నదాతలే కాదు అమాయక రియల్ వ్యాపారులు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కూల్చడం కాదు కట్టడం నేర్చుకోవాలని, అబద్ధాలు చెప్పడం కాదు అభివృద్ధి చేయడం నేర్చుకోవాలని కాంగ్రెస్ పాలకులకు చురకలంటించారు. పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు. రియల్ ఢమాల్.. ఇన్నా సజీవ సమాధి, మూసీ, హైడ్రా పేరుతో మూటలు కడుతున్న కాంగ్రెస్ గద్దలన్నారు. హైదరాబాద్‌లో గత త్రైమాసికంలో 49 శాతం విక్రయాలు తగ్గాయని తెలిపారు. ఇంకా కాంగ్రెస్ పాలనలో ఎన్ని దారుణాలు చూడాలోనని ఆందోళన వ్యక్తంచేశారు.



## ఇక టూవీలర్‌దారులకు రెండు హెల్మెట్లు

**బండి కొనేప్పుడే అంటగట్టే ఆలోచన**

**న్యూఢిల్లీ, మార్చి 28 :** దేశంలో నిరంతరం రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కొన్ని మార్పులను కూడా తీసుకొస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కర్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై దేశంలో టూవీలర్లను ఖచ్చితంగా ఐఎస్ఐ సర్టిఫికేషన్ కలిగిన రెండు హెల్మెంట్లతో కలిపి విక్రయించాలని పేర్కొన్నారు. ఇదే అమలులోకి వస్తే ద్విచక్రవాహం కొనే వ్యక్తులకు బండి డెలివరీతో పాటు– రెండు హెల్మెట్లు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందిజ కేంద్ర మంత్రి గడ్కరీ ఈ విషయాన్ని దిల్లీలో జరిగిన ఆటో సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను దేశంలోని టూవీరల్స్ హెల్మెట్ తయారీదారుల అసోసియేషన్ స్వాగతించింది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గడ్కరీ ఆదేశం కీలకమైనదిగా తెలుస్తోంది. దేశంలో చాలా కాలంగా ఎదుర్కొంటు–న్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించటానికి ఇది దోహదపడే చర్యగా ఆటో రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెంట్లను వాహనదారులు ఉపయోగించేలా ఇది ప్రేరేపిస్తుందని హెల్మెట్ తయారీదారుల సంఘం అభిప్రాయపడింది.

## శనగ రైతులకు కేంద్రం ఊరట

**దిగుమతులపై 10శాతం సుంకం విధింపు**



**న్యూఢిల్లీ, మార్చి 28 :** దేశంలో ఈ ఏడాది దేశీ శనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. దేశంలోని రైతులకు మేలు జరిగేలా ఏప్రిల్ 1 నుంచి వచ్చే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి శనగ దిగుమతులపై 10శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం పాటించిన సుంకం లేని విధానాన్ని రద్దు చేస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. బదులుగా ఏప్రిల్ 1 నుండి దేశీ శనగపై 10దిగుమతి సుంకాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. దేశంలో ఈ ఏడాది చనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నందున ఈ చర్యలకు ఉపక్రమించాల్సి వచ్చిందని కేంద్రం చెబుతోంది. ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చేలా దేశీ శనగ పై ప్రభుత్వం 10శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. గత సంవత్సరం మే నెలలో, దేశీయ లభ్యతను పెంచడానికి, ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం సుంకం లేని శనగ దిగుమతిని అనుమతించింది. దిగుమతి సుంకం మినహాయింపు మార్చి 31, 2025 వరకు వర్తిస్తుంది. ఈ మార్పుకు సంబంధించి ఈ నెల 27న ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం, చనగ ఉత్పత్తి 2024–25లో 11.5 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు. అయితే, ఇది గతేడాది ఇది 11 మిలియన్ టన్నులు.

ఆదాబ్ రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# నీతిమాలిన రాజకీయాలు పని చేయవు!



ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం.. ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలు చెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం.. ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా.. ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు.. నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్ధం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. అందుకే రాజకీయాల్లో విలువలకు తావులేకుండా పోతోంది. రాజకీయాల్లో విలువలు పతనం అయ్యాయి. అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు భ్రమిస్తున్నాయి. తామే మంచి చేశామని, చేస్తామని చెప్పకుంటూ పబ్బం గడుపుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికార పార్టీలోకి పలుఉవరు చేరికలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇంకా కొనసాగుతాయి.

బిఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం బిఆర్ఎస్ అలుపెరుగని పోరాటం చేస్తోంది. ఉప ఎన్నికలు వస్తాయని కూడా హెచ్చరికలు చేస్తోంది. ఈ విషయంలో గతంలో ఉన్న చట్టాలే ఇప్పుడూ ఉన్నాయని, ఆనాడు లేని ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని సిఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. అయితే కోర్టు తీర్పులకు, లేదా హెచ్చరికలకు స్పీకర్ లోబడి ఉండాలా అన్న చర్చ సాగుతోంది. స్పీకర్ కూడా చట్టపరమైన అధికారంలో ఉన్నవారే. అసెంబ్లీకి సంబంధించి ఆయన నిర్ణయాలకే ప్రాధాన్యం ఉన్నాయి. మని సుప్రీం తీర్పు ఎలా ఉన్నా, అధికారపక్షం మాత్రం ధీమాగా ఉంది. ఇకపోతే ఎపిలో వైకాపా నుంచి అనేకమంది జారుకున్నారు. అధికార టిడిపిలో చేరారు. అక్కడో వెసలుబాటు ఉంది. టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు మూడూ కూటమిగా అధికారంలో ఉండడంతో మూడు పార్టీల్లోనూ చేరుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పార్టీలో చేరిపోతున్నారు. దీంతో ఏ పార్టీకి వచ్చిన నష్టం లేదు. ఎందుకంటే రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్శణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని లెక్కలు వేసుకుంటున్నారు. రాజకీయాల్లో నేర్చుకున్న సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. ఎపిలో కూటమి నేతలు అనుసరిస్తున్నా గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యేలను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ అంటూ ప్రచారం చేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు.కానీ ప్రచారంలోనే అభివృద్ధిని చూపి అవినీతికి, అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్, వైకాపా నేతల అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. అధికార మార్పుతో రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీనిని జీరిణించుకుని మంచి సంప్రదాయం పాటించి మళ్లీ ప్రజల్లో పేరు తెచ్చుకుని సాగాల్సి ఉంటుంది.

సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈకాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి నేతలు , అధికారం దక్కగానే అవినీతి బురదలో కూరుకుపోతున్నారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని అహంకారం ప్రద్శించారు. అందుకే ప్రజలు తీర్పునిచ్చారు. వారివెంట ఉన్న బలగం అంతా మెల్లగా జారుకోవడం అన్నది కూడా సహజ పరిణామం. ఇది ఏ రాజకీయ పార్టీకైనా వర్తిస్తుంది. సచ్చీలతతో మళ్లీ ప్రజల ముందుకు వెళ్లాలి. తమ సిద్ధాంతాలను మార్చుకోవాలి. ప్రజల కోసం పోరాటాలు చేయాలి. కానీ జగన్ అదేపనిగా విమర్శలకే పరిమితం అయ్యారు. ఐదేళ్లలో పోలవరం ముందుకు కదదలేదు. అమరావతిని పక్కన పెట్టాడు. అనేకరకమైన లిక్కర్ బ్రాండ్లతో అవినీతికి తెరలేపారు. ఇవన్నీ ప్రజల ముందున్న సజీవ సాక్ష్యాలు. అందుకే అధికారం పోవడంతో రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. పోరాటాలతో మళ్లీ రాటుదేలితేనే ప్రజలు వెంటనడుస్తారు.

# మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు

## కేంద్రం అనుమతి కోరేందుకు ప్రయత్నాలు



**హైదరాబాద్, మార్చి 28 :** మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు వస్తుండటంతో హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ రేట్లు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రోజుకు కోటిన్నర రూపాయల నష్టం వస్తోందని, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఇప్పటికీ వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం వేయొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సుముఖంగా లేదని తెలుస్తోంది. నగరంలో మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)లో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మూడు కారిడార్ల పరిధిలో ప్రయాణించే వారి సంఖ్య రోజూ 5.10 లక్షలకు చేరింది. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఎల్ అండ్ టీ ఆదాయం సమకూర్చుకుంది. అయితే, 2020లో కరోనా లాక్‌డౌన్‌తో మెట్రో కుదేలైంది. 2022 నుంచి క్రమంగా కోలుకున్నా నష్టాల ఊబి నుంచి బయటపడలేదని చెబుతోంది. మెట్రో నిర్వహణలో రోజుకు సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వస్తున్నట్లు ఎల్ అండ్ టీ అధికారులు తరచూ చెబుతున్నారు. ఆశించినవిధంగా ప్రయాణికుల సంఖ్య రోజుకు 6 లక్షలకు పెరగకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. టికెట్ రేట్ల సవరణ విషయంపై హెచ్ఎంఆర్ సంస్థ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించి నివేదిక సమర్పించింది. అదే సమయంలో 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో టికెట్ చార్జీల విషయం మరుగునపడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మెట్రోకు మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిందని, కనీసం టికెట్ చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తే కొంతైనా నష్టాలను పూడ్చుకుంటామని ఎల్అండ్‌టీ కోరుతోంది. అయితే మెట్రో రెండో దశ నిర్మాణంపై దృష్టి సారించిన సర్కారు ఇప్పుడు కేంద్రానికి ఈ విషయం తెలియజేస్తే... అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తోంది. అంతేకాకుండా కాలుష్యరహితంగా నడిచే మెట్రో రైళ్లలో టికెట్ ధరలు అందుబాటులో ఉండాలని, పెంచితే ప్రయాణికుల సంఖ్య పడిపోతుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటోంది.

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

## వచ్చే నెలలో థాయిలాండ్, శ్రీలంక షెడ్యూల్



**న్యూఢిల్లీ, మార్చి 28 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల ఏప్రిల్లో విదేశీ పర్యటనకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3-4 తేదీల్లో థారులాండ్ ఆతిధ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు- భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4-6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు- భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ రెండు దేశాల పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్లు- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఏప్రిల్ 3 - 4 తేదీల్లో ప్రధాని థాయ్‌లాండ్‌లో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్' కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

# మరోమారు రాహుల్ అమెరికా పర్యటన

## వచ్చే నెల 19 నుంచి అంటూ కథనాలు



**న్యూఢిల్లీ, మార్చి 28 :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు- ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

# భారీ దోపిడీకి పక్కా స్కెచ్

- సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు
- అంతర్రాష్ట్ర ముఠా పనేనని అనుమానాలు



**వరంగల్, మార్చి 28 :** వరంగల్‌లో "టాటూ గ్యాంగ్".. భారీ దోపిడీలకు పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ఈ ముఠా టార్గెట్ చేసింది.. విశాలంగా ఉంటే ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసి లూటీలకు బరితెగిస్తోంది.. తాజాగా హనుమకొండ పరిధిలోని ఓ ఇంట్లో భారీదోపిడీకి ప్రయత్నం చేశారు.. అదృష్టవశాత్తు ఆ ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.. సీసీ కెమెరా ఫుటేజ్ చూసి షేక్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురిలో జరిగిన రాబరీ నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది..సీసీ కెమెరా ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.. ఈ దోపిడికి పాల్పడిన ముఠా మామూలు దొంగలు కాదని కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అని గుర్తించారు.. మొత్తం ఆరుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దోపిడీలకు పాల్పడ్డారు.. వాళ్ళ ఒంటిపై ప్రతి ఒక్కరి ఎడమ చేతిపై పచ్చబొట్టు, చేతిలో మారణాయుధాలు కలిగి ఉండడం చూసి ఇదేదో డిఫరెంట్ డేంజర్ గ్యాంగ్‌గా భావిస్తున్నారు. విద్యారణ్యపురిలో దోపిడీకి పాల్పడిన ఈ ముఠా ఆ ఇంటి కిటికీ గ్రిల్స్ ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించారు.. విలువైన వస్తువులు దొంగిలించారు.. సీసీ కెమెరాల్లో వాళ్ల దోపిడి దృశ్యాలు అంతా రికార్డయ్యాయి. అర్థరాత్రి దోపిడికి పాల్పడిన ముఠా రెండున్నర గంటలపాటు ఆ ఇంట్లోనే గడిపినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్‌లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు.. ఈ ముఠా ఇంట్లోకి ప్రవేశించిన సమయంలో ఆ ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉన్నారు. ఎవరు నిద్రలేచి ప్రతిఘటించకపోవడంతో అంతా ప్రాణాలతో బయటపడ్డారు.. లేకపోతే ఊహించిన విధంగా ప్రాణ నష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ దోపిడీ ఘటన జరిగి 24 గంటల వ్యవధిలో వాళ్ళు ఇంకా సిటీ దాటి వెళ్ళలేదని పోలీసు నిఘా వర్గాలు, టీమ్స్ గుర్తించాయి.. ఆరు ప్రత్యేక బృందాలతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ ముఠా వరంగల్ సిటీ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని.. కచ్చితంగా ఏదో ఒక దారుణానికి పాల్పడతారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ముందుగా అప్రమత్తమైన పోలీసులు.. నగర పరిసరాలన్నీ జల్లెడ పడుతున్నారు.. టాటూ దొంగల గురించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ దొంగల గురించి ఏమైనా సమాచారం ఉంటే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

# యువకుడిని నరకిచంపిన యువతి తండ్రి

## ప్రేమ వ్యవహారంతోనే ఘటన

**పెద్దపల్లి, మార్చి 28 :** పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలిలో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో సాయి తన పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా అక్కడకు వచ్చిన యువతి తండ్రి సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్‌ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రా యి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.




# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

**నాగర్ కర్నూల్, మార్చి 28 :** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

# భద్రాచలం ప్రభుత్వా దవాఖాన వద్ద ఉద్రిక్తత

## భవనం కూలిన ఘటనలో న్యాయం చేయాలని ఆందోళన



**భద్రాచలం, మార్చి 28 :** భవనం కుప్పకూలిన ఘటనలో శిథిలాల కిందపడి చనిపోయిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కుల సంఘాలు, వామపక్ష, కుల సంఘా నాయకులు, తాపీమేస్త్రి ఉపేందర్ బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే మృతదేహాలకు పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వ దవాఖాన మార్చురీ ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీపతి సేవా ట్రస్టు పేరిట భద్రాచలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరు అంతస్థుల భవనం బుధవారం కూలిన ఘటన విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుని తాపీమేస్త్రి ఉపేందర్, కార్మికుడు కామేశ్వర్‌రావు మృతిచెందారు. గురువారం శిథిలాల్లో చిక్కుకుపోయిన తాపీమేస్త్రి కామేశ్వర్‌రావును అధికారులు ప్రాణాలతో బయటకుతీశారు. కానీ అప్పటికే కాలు, చెయ్యి నుజ్జునుజ్జయి, తీవ్ర రక్తస్రావం జరిగిన కామేశ్వర్‌రావు దవాఖానకు తరలించిన వెంటనే ప్రాణాలు వదిలాడు. శుక్రవారం ఉదయం ఉపేందర్ మృతదేహాన్ని శిథిలాల కిందినుంచి రెస్క్యూ సిబ్బంది వెలికి తీసింది. పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ డెడ్‌బాడీని ఆయన కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస కావొద్దు

- తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా పెట్టాలి
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జడల యశీల్ గౌడ్



**యాదాద్రి భువనగిరి రాజముద్ర న్యూస్:** యువత, విద్యార్థులు ఆన్ లైన్ అక్రమ క్రికెట్ బెట్టింగ్ యాప్ లకు అలవాటు పడి అప్పుల పాలై జీవితాలు నాశనం చేసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు,సామజిక వేత్త, జె వై జి ఫౌండేషన్ అధినేత జడల యశీల్ గౌడ్ అన్నారు. అక్రమ బెట్టింగ్ యాప్లలో బెట్టింగ్ కు పాల్పడి ఆన్లైన్ గేమ్స్ ఆడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాది%శీ%చవచ్చు అన్న భ్రమలో యువత విద్యార్థులు బెట్టింగ్ యాప్స్ కి బానిసలుగా మారి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకొని విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో దీని వ్యసనం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా పెట్టి తప్పుడు మార్గంలో పయనించకుండా జాగ్రత్త వహించాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలపై కోటి ఆశలతో రెక్కలు ముక్కలు చేసుకుని ఉన్నతమైన విద్యలు చదివించి ఉద్యోగాలలో స్థిరపడతారని ఆశతో ఉన్నారని అలాంటి గొప్ప తల్లిదండ్రుల ఆశలు ని కలు చేయవద్దని తెలిపారు. యువత పెడదారిని వదిలి సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులు, పెద్దల గురువుల మాటలు విని ప్రయోజకులుగా ఎదగాలన్నారు. పిల్లలు ఉన్నత స్థాయిలో కూర్చున్నప్పుడే తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా మనల్ని గౌరవిస్తుందని తెలిపారు.

## జూన్ రెండు లోగా ఉద్యమకారులను గుర్తించకుంటే మరో పోరాటం : టియు జెఎసి



**వలిగొండ రాజముద్ర న్యూస్** : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన ఉద్యమకారులను జూన్ రెండు లోగా గుర్తించ కుంటే తిరుగుబాటు తప్పదని మరో పోరాటం చేయడానికి టీ యు.జేఏసీ సిద్ధంగా ఉందని టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆయన గురువారం టి యు జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అదే విధంగా ఉద్యమకారులను కూడా గుర్తించి ఆదుకోవాలని ఉద్యమకారులు లేనిదే త్యాగాలు లేనిదే బలిదానాలు లేనిదే రాష్ట్రం రాలేదని గుర్తించుకోవాలన్నారు ఏప్రిల్ 20.21 తేదీలలో హైదరాబాదులో ఇందిరాపార్కు వద్ద టీయూజేఏసీ మహాసభలు జయప్రదం చేయాలని ఆయన ఉద్యమకారులకు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు పబ్బు లక్ష్మయ్య గంగదారి సత్తయ్య మంటి లింగయ్య గంధ మల్ల గోపాలు తదితరులు పాల్గొన్నారు.



## ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి : సిపిఐ

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** వలిగొండ మండలంలోని దుప్పల్లి గ్రామంలో ఈరోజు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో రైతులు ఎంతో కష్టపడి పంట చేతికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు అని అన్నారు వెంటనే రైతులను గుర్తించి ఎండిన పంట పొలాలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్లంకి మహేష్, శాఖ కార్యదర్శి కట్ల యాదగిరి, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అంబటి అంజయ్య ,నరిగె యాదయ్య, మారోజు నరసింహ చారి, కన్న మైన పృథ్వీరాజ్, ఎర్ర కిరణ్ , మెట్టు లక్ష్మీనారాయణ, బలగొని రాజు, ఎర్ర వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం ద్వార స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు

**- డిఎండబ్ల్యూఓ హనుమంతరావు**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ ప్రభుత్వం ద్వార మైనారిటీలు అనగా ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశిల కొరకు అర్హులైన అభ్యర్థులు ఓబిఎంఎంఎస్ పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా ఏప్రిల్ 5వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డి ఎం డబ్ల్యు ఓ హనుమంతరావు తెలిపారు. వ్యవసాయ పథకాలకు 21-55 సంవత్సరాలు (జూలై 1నాటికి), వ్యవసాయ, సంబంధిత రంగాలకు 21 నుండి 60 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్ , రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతాలలో సంవత్సరానికి రూ.2,00,000 మించకుండ ఉండాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీ చేసిన కుల ధ్రువికరణ పత్రము కలిగి ఉండాలని తెలిపారు. రవాణా పథకాలకు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, అదేవిధంగా వ్యవసాయ పథకాలకు పట్టాదార్ పాస్ బుక్ ఉండాలని తెలిపారు. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం కలిగి ఉండాలని అన్నారు. మొత్తం లక్ష్యంలో మహిళలకు కనీసం 25 శాతం, అదేవిధంగా ఒంటరి, వితంతువులు, వికలాంగులు కనీసం 5 శాతం అర్హులని తెలిపారు. తెలంగాణ ఉద్యమ వీరులు, ఎస్సీ ఉపవర్గ ఉద్యమాల్లో త్యాగం చేసిన వారి కుటుంబాలు, స్వయం ఉపాధిక లో నైపుణ్యం ఉన్నవారు ఓబిఎంఎంఎస్ పోర్టల్లో నమోదు చేసుకొని అట్టి ఫారమ్ ను డౌన్లోడ్ చేసుకొని తెలుపబడిన డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయమునకు సమర్పించాలని అదేవిధంగా పట్టణ ప్రాంతాలకు చెందిన వారు మున్సిపల్ కార్యాలయములో సమర్పించాలని ఆయన తెలిపారు. ఒక కుటుంబానికి రేషన్ కార్డుకి చెంది గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వము నుండి లబ్ది (సబ్సిడీ) పొందిన వారు అనర్హులని ఆయన తెలిపారు. ఆర్థికంగా సాధ్యమయ్యే స్వయం ఉపాధి కార్యకలాపాన్ని ఎంపిక చేసుకోవాలి డిఎండబ్ల్యుఓ హన్మంతరావు తెలిపారు.

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... యువత తలుచుకుంటే ఎంతటి కష్టమైన పని అయినప్పటికీ ఛేదించగలుగుతారన్నారు. యువత గొప్ప లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని కలెక్టర్ తెలిపారు. నచ్చిన రంగాల్లో యువత ప్రత్యేక సాధనతో పాల్గొని దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. క్రీడా, సాంస్కృతిక ఇతర వైవిధ్య రంగాల్లో రాణించేలా కృషి, పట్టుదలతో గ్రామస్థాయి నుండి జాతీయస్థాయి వరకు తమ ప్రతిభను కనబరచుకోవాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకువస్తూ ప్రోత్సహిస్తుందని వాటిని అందిపుచ్చుకొని తమ జీవితాల్లో అనుకున్న గమ్యాలకు చేరే విధంగా పాటుపడాలని యువతకు సూచించారు. ఎందరో మహనీయులు దేశ ఐక్యత కోసం కృషి చేసిన వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశాభ్యున్నతికి పాటుపడాలని కలెక్టర్ సూచించారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక, వ్యాపార రంగాల్లో సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. చెడు వ్యసనాలకు గురికాకుండా, సమాజంలో మంచి సందేశాన్ని ఇచ్చే విధంగా యువత వృద్ధి చెందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పాటలు, జానపద, పల్లె నృత్య, సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్, కవిత్వ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఐసయ్య, డివైఎస్ఓ హనుమంతరావు , డిఎం అండ్ హెచ్ఓ వెంకటరవణ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ జీవరాజు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్, రామ సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అణిచివేత నుంచే తిరుగుబాటు మొదలవుతోంది

**ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్**



**ఆలేరు రాజముద్ర న్యూస్ :** రాజ్యాంగం పరిధిలో, ప్రజాస్వామ్య బద్ధంగా రైతాంగ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, రైతులకు గత ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా మోడీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పంజాబ్ లో రైతాంగం చేస్తున్న ఉద్యమంపై పంజాబ్ ఆప్ ప్రభుత్వం, కేంద్ర మోడీ ప్రభుత్వం కలిసి చేస్తున్న రైతాంగ అణిచివేత అప్రజాస్వామికమని ఇది రైతాంగ తిరుగుబాటుకు దారితీస్తుందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ ఐ కే ఎం ఎస్)జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ లు స్పష్టం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్ కే ఎం) ఇచ్చిన పిలుపు లో భాగంగా ఏ ఐ కే ఎం ఎస్ ఆధ్వర్యంలో మార్చ్ 28 న ఆలేరు రైల్వే గేట్ దగ్గర కేంద్ర మోడి ప్రభుత్వం, పంజాబ్ ఆప్ ప్రభుత్వ దిష్టి బొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అడివయ్య, కుమార్ లు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ఎరుగని మోడీ, ఆఫ్ ప్రభుత్వం బడా కార్పోరేట్ సంపన్న వర్గాలకు సేవచేస్తుందని, దేశ వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పగించి, రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడానికి కంకణం కట్టుకున్నదని అన్నారు. పాలకులు ఇదే తరహాలో ప్రభుత్వాలు రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తే రాబోయే కాలంలో ప్రభుత్వాలు రైతాంగ, ప్రజా ఉద్యమాలు, తిరుగుబాట్లు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మామిడాల సోమయ్య జిల్లా ఉపాధ్యక్షులు చిరబోయిన రాజయ్య, పిన్నపురెడ్డి, రాఘవరెడ్డి ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, బర్మ బాబు బుడిగె లక్ష్మయ్య, చిరబోయిన కొమురయ్య, తలారి వెంకటేష్, తమ్ముడి అంజయ్య, కర్రే స్వామి, కొమ్మిడి గోపాల్ రెడ్డి, వంగాల మధుసూదన్ రెడ్డి, ముద్దేపాక చంద్రయ్య, గడ్డం మంకయ్య, పంజాల మురళి, బుగ్గ యాదగిరి, కుందే బీరయ్య, పూసల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్‌లో కళ్యాణ్ జ్యువెలర్స్ కొత్త షోరూమ్‌ను ప్రారంభించిన అక్కినేని నాగార్జున

**షోరూమ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మెగా-లాంచ్ ఆఫర్‌లను ప్రకటించిన జ్యువెలరీ బ్రాండ్**




**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన, ప్రముఖ ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్, శుక్రవారం హైదరాబాద్‌లోని చందానగర్ లో తమ షోరూమ్‌ను వైభవంగా ప్రారంభించినట్లు వెల్లడించింది. సూపర్‌స్టార్ నాగార్జున చేతుల మీదగా ప్రారంభించిన ఈ సరికొత్త షోరూమ్ ద్వారా రాష్ట్రంలో బ్రాండ్ కార్యకలాపాలను మరింత విస్తరించటమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ షోరూమ్ కళ్యాణ్ జ్యువెలర్స్ కు చెందిన అద్భుతమైన డిజైన్‌ల శ్రేణిని అందిస్తుంది, వీటిలో ముహూరత్ వివాహ ఆభరణాల శ్రేణి, ముద్ర చేతితో రూపొందించిన యాంటిక్ ఆభరణాలు, నిమా (టెంపుల్ జ్యువెలరీ), మరెన్నో ప్రసిద్ధ బ్రాండ్‌లు ఉన్నాయి. కళ్యాణ్ జ్యువెలర్స్ కు చెందిన జీవనశైలి ఆభరణాల బ్రాండ్ - కాండెరే ఆవిష్కరణ ద్వారా ఈ ప్రారంభోత్సవ వేడుకలు మరింత ఆకర్షణీయంగా మారాయి. రూ.10,000/- ధరలతో ప్రారంభమయ్యే కాండెరేలోని ఆభరణాలు ఆదర్శవంతమైన బహుమతిగా నిలుస్తాయి. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. కళ్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉంది. ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్ అనే కంపెనీ సిద్ధాంతానికి అనుగుణంగా వారు చూపుతున్న నిబద్ధత పరిశ్రమలో వారిని ప్రత్యేకంగా నిలబెట్టింది. మీ అందరినీ కలుసుకునే అవకాశం లభించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను అని అన్నారు. కొత్త షోరూమ్ గురించి కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ, ఒక కంపెనీగా, మేము గణనీయమైన మైలురాళ్లను చేరుకున్నాము. గత కొద్ది సంవత్సరాలుగా, మేము ఈ ప్రాంతంలో మా కార్యకలాపాలను వ్యూహాత్మకంగా విస్తరించాము. చందానగర్‌లోని కొత్త షోరూమ్ మా మార్కెట్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందని, అదే సమయంలో మా విలువైన కస్టమర్లకు మరింత సౌలభ్యం,అవకాశాలను అందిస్తుందని మేము విశ్వసిస్తున్నాము అని అన్నారు.

## ఉపకార వేతన దరఖాస్తు గడువు పొడిగింపు

**షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి మల్లేశం**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం ద్వారా అర్హులైన ఎస్సి, ఎస్ టి, బి.సి, మైనారిటీ విద్యార్థిని విద్యార్థుల భోదన రుసుము, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువును మార్చ్ 31 నుండి మే 31 వరకు పొడగిం చడం జరిగిందని షెడ్యూల్డ్ కులము ల అభివృద్ధి అధికారి యన్. మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో షెడ్యూల్డ్ కులము ల అభివృద్ధి శాఖలో 2447 విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా కేవలం 1654 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇంక 823 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నది, వివిధ రకాల వృతిపరమైన కోర్సుల ప్రవేశములు ఇంకను జరుగుతున్నవి. అలాగే ప్రవేశము పొందిన విద్యార్థుల యొక్క వివరములు కూడ సంబంధిత యునివర్సిటీల వారుసమర్పించవలసియున్ది. ఇప్పటి వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోని వారిని కళాశాల యాజమాన్యాలు www.epass.cgg.gov.in నందు మే 31 వరకు దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు.

## ఎల్ఆర్ఎస్ సమయం పొడిగించాలి

**మాజీ జెడ్పిటిసి బోట్ల పరమేశ్వర్**



**ఆలేరు రాజముద్ర న్యూస్ :** ఎల్ ఆర్ ఎస్ ఫీజు చెల్లించేందుకు కనీసం మూడు నెలల పాటు గడువు పెంచాలి. పేద ప్రజలు ఒకేసారి వేల రూపాయలు చెల్లించాలంటే డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. గడువు దాటితే లక్షలు చెల్లించాలంటే మూలుగుతున్న నక్కపై తాటికాయ పడ్డ విధంగా అవుతుంది. గత రెండు రోజుల నుండి ఎల్లారీస్ దరఖాస్తుదారుల ఆన్లైన్ ఫీజు చెల్లింపులకు సర్వర్ మొరాయించటంతో గంటల తరబడి మున్సిపల్ కార్యాలయాలకే పరిమితం కావలసి వచ్చింది. యాదాద్రి జిల్లాలో పలుచోట్ల మరియు రాష్ట్రంలో పలు జిల్లాలలో ఇదేవిధంగా సర్వర్ మొరాయించడం జరిగింది. అందువలన ప్రభుత్వం ఆలోచన చేసి సమయం పొడిగించాలని ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఆలేరు మాజీ జెడ్పిటిసి బొట్ల పరమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు.



## 1వ వార్డులో దొంగతనాల మీద అవగాహన సదస్సు

**ఆలేరు రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని ఒకటవ వార్డులో దొంగతనాల మీద అవగాహన సదస్సును ఆలేరు ఎస్సై రజినీకర్ ఆధ్వర్యంలో నిర్వహించి దొంగలభారి నుండి విలువైన వస్తువులను ఎలా రక్షించుకోవాలో తెలియజేయడము జరిగినది. అలాగే అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరినారు. కొత్త వ్యక్తులకు ఇల్లు అద్దెకిస్తే వాళ్ళకి సంబంధించిన ఆధార్ కార్డును తప్పకుండా తీసుకోవాలని చెప్పినారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, పీసీ నవీన్, కానిస్టేబుల్ రాజు, ద్వారపు శంకర్, దుబాయ్ అశోక్, సిద్ధంకి మాధవరెడ్డి, సంతోష్, గిరి పాల్గొన్నారు.



## అల్లా కృప అందరికీ ఉండాలి

**మోటకొండూర్ రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలో జామియా మసీద్ వద్ద రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో నమాజ్ ను జరుపుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ పవిత్ర రంజాన్ మాస ఉపవాసాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొని అల్లా కృప అందరికీ ఉండాలని వారు కోరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొనడం జరిగింది.

## పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు రేషన్ కార్డులు ఇవ్వాలి

**ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పాదయాత్రలో చెరుపల్లి డిమాండ్**




**ఆలేరు రాజముద్ర న్యూస్ :** యదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు వివిధ రకాల పెన్షన్లు ఇవ్వాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని ద్వారకా నగర్ లో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు ప్రారంభించి మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వందలాది మంది పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ప్రభుత్వాలు ఇవ్వకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అరుహులైన పేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అదే విధంగా పట్టణంలో స్థిర నివాసం ఉంటున్న స్థలం లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని అదేవిధంగా స్థలం ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర నిర్వహిస్తున్న పాదయాత్ర బృంద సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ ఆలేరు పట్టణం పేరుకు నియోజకవర్గ కేంద్రం అయినప్పటికీ నియోజకవర్గ స్థాయిలో ఇది అభివృద్ధి చెందలేదని దీనికి పాలకవర్గాల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా ఆలేరు రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని అదేవిధంగా ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 100పడుకుల ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ రహదారి దగ్గరగా ఉండటం వలన రోడ్డు ప్రమాదాల బారినపడినటువంటి ప్రజలను రక్షించే విధంగా ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు అందించలేకపోతుందని ఆసుపత్రిలో ఐసీయూ సేవలను ప్రారంభించి 100 ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తేనే ఇక్కడ ప్రజల వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతానికి సాగు తాగు నీరు అందించే గంధ మల్ల రిజర్వాయర్ ను నిర్మించాలని ఆలేరు వాగులో నీరు నెలకొద్ది ప్రవహించి పైప్రాంతానికి వెళ్తున్నప్పటికీ ఆలేరు ప్రాంతంలో వ్యవసాయ భూములలో కానీ మంచినీటి బోర్లలో కానీ నీటిమట్టం పెరగలేదని పట్టణంలో అనేకమంది రైతులు మొరపెట్టుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం యుద్ధ ప్రాతిపదికన ఆలేరు వాగులో చెక్ డ్యాములు నిర్మాణం చేపట్టి, ఈ ప్రాంత తాగు నీటి అవసరాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం పట్టణ కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ ఇక్బాల్ మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, పాదయాత్ర బృందం సభ్యులు ఎమ్ ఏ ఇక్బాల్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మొరిగాడి రమేష్, వడ్డేమాన్ బాలరాజ్, బొప్పిడి యాదగిరి, కాసుల నరేష్, మొరుగాడి మహేష్, మొరుగాడి అజయ్, చెక్క పరశు రాములు, వడ్డేమాన్ విప్లవ కుమార్, యాసారపు ప్రసాద్, మొరిగాడి స్వరూప, అయిలీ చంద్రకళ, మొరగాడి మంజుల, ఐదు అంజమ్మ, మొరిగాడి అనిత, ఈ కార్యక్రమానికి సంబంధించిన రూట్ మేనేజర్ గా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మొరిగాడి చంద్రశేఖర్ ఉన్నారు. ఈ పాదయాత్రకు సంఘీభావంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌలు, ఘనగాని ఎస్ఎఫ్ఐ మాజీ మండల కార్యదర్శి చెన్న రాజేష్, మల్లేశం, కటకం సుదర్శన్, బర్ల సిద్దులు, నాగరాజు, మాధవి, నవీన్, సుధ గాని సత్యరాజయ్య, పిక్క గణేష్, బండ శ్రీనివాస్, మిట్ట శంకరయ్య, ఘనగాని రాజు, రాచర్ల సిద్దులు, సూదగాని నరేందర్, ఘనగాని భాగ్యమ్మ, శ్రీలత, మోడీ మహాలక్ష్మి, సువర్ణ, ఎలగందుల లక్ష్మి, అంగిరేకుల భాగ్య, మైలారం కళ్యాణి, కందుల విజయ, లావణ్య తదితరులు పాల్గొన్నారు. శనివారం రోజున మున్సిపల్ కార్యాలయం ముందు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పాదయాత్ర బృందం సభ్యులు తెలియజేశారు. ఇల్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, వృద్ధాప్య వితంతు ఒంటరి మహిళ పెన్షన్లు లేని పేదలు పెద్ద సంఖ్యలో ఈ ధర్నా కార్యక్రమం లో పాల్గొనాలని పట్టణ ప్రజలకు పిలుపు ఇచ్చారు. సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆలేరు ఎమ్ ఎ ఇక్బాల్ అన్నారు.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## అరెస్టు నుంచి రక్షణ కల్పించండి

### న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కుణాల్ కామ్రా



**ముంబాయి :** అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలని స్టాండప్ కమెడియన్ కుణాల్ కామ్రా మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయంలో ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. ఈనేపథ్యంలో పోలీసులు తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. ఈ కేసులు మహారాష్ట్రలో నమోదైనప్పటికీ అతడు తమిళనాడుకు చెందినవాడు కావడంతో మద్రాసు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఇటీవల ముంబయిలో కుణాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించారు. ఇందులో శిందేను "గద్దార్" (ద్రోహి)గా పేర్కొంటూ ఓ పేరడీ పాటను ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణాన్ని చూపుతూ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం వేదికపై శివసేన కార్యకర్తలు దాడి చేశారు. దీనిపై ఇటీవల స్పందించిన ఏక్‌నాథ్ శిందే.. కామ్రా వ్యాఖ్యలు ఒక వ్యక్తికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు 'సుపారీ' తీసుకున్నట్లు ఉన్నాయన్నారు. వాక్ స్వాతంత్ర్యానికి, వ్యంగ్యానికి ఓ హద్దు ఉంటుందని పేర్కొన్నారు.

## కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు



**న్యూఢిల్లీ :** ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై పిటిషన్ దాఖలైన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేయాలని ఇటీవల దిల్లీ కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా దిల్లీ పోలీసులు కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈమేరకు పోలీసులు న్యాయస్థానానికి నివేదికను సమర్పించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ జరుగుతోందని, మరింత సమయం కావాలని కోర్టును అభ్యర్థించారు. దీంతో తదుపరి విచారణను ఏప్రిల్ 18కి కోర్టు వాయిదా వేసింది. 2019లో ద్వారకలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటుచేయడానికి ప్రజానిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ దిల్లీ రౌజ్‌అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ సహా ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఆ అభ్యర్థనను దిల్లీ కోర్టు అంగీకరించింది.



## అమెరికా-గ్రీన్‌ల్యాండ్ వ్యవహారంతో మాకు సంబంధం లేదు : పుతిన్

**రష్యా :** గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో విలీనం చేసుకోవాలన్న ట్రంప్ ప్రణాళికలతో తమకు ఏ సంబంధం లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఆయన ఆర్కిటిక్ పోర్టు నగరం మురుమాన్స్క్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'సంక్షిప్తంగా చెప్పాలంటే గ్రీన్‌ల్యాండ్ విషయంలో అమెరికావి చాలా సీరియస్ ప్లాన్లు. వీటికి లోతైన చారిత్రక మూలాలున్నాయి. అమెరికా ప్రణాళిక ప్రకారం దాని భౌగోళిక-వ్యూహాత్మక, సైనిక-రాజకీయ, ఆర్థిక ప్రయోజాల కోసం ప్రయత్నాలు చేస్తుంది. గ్రీన్ ల్యాండ్ అంశం రెండు దేశాలకు సంబంధించింది. రష్యాతో దానికి ఎలాంటి సంబంధం లేదు" అని పుతిన్ పేర్కొన్నారు. రష్యా సహా ప్రపంచ దేశాల్లో ఆర్కిటిక్ ప్రాధాన్యం పెరుగుతోందని పుతిన్ అభిప్రాయపడ్డారు. కానీ, దురదృష్టవశాత్తూ భౌగోళిక రాజకీయ పోటీ, ఈ ప్రాంతంలో పొజిషన్ కోసం ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. ఇక గ్రీన్‌ల్యాండ్ యాజమాన్యం విషయం నేరుగా ఎక్కడా జోక్యం చేసుకోకపోయినా.. ఘర్షణలకు ఉత్తర ప్రాంతం వేదికగా మారుతుందన్న ఆందోళన మాస్కోలో ఉందన్నారు. ఓ రకంగా ఇవి ట్రంప్ ప్రణాళికలపై తమకే అభ్యంతరం లేదని పరోక్షంగా చెప్పినట్లైందని నిపుణులు చెబుతున్నారు.

### వాన్స్ పర్యటనకు ముందు వ్యాఖ్యలు..

గ్రీన్‌ల్యాండ్‌పై పుతిన్ వ్యాఖ్యలు చాలా వ్యూహాత్మక సమయంలో వెలువడ్డాయి. శుక్రవారం అమెరికా అధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ గ్రీన్‌ల్యాండ్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని సందర్శించనున్నారు. ఈ పర్యటనపై ఇప్పటికే గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్ గుర్రుగా ఉన్నాయి. తొలుత ఉషా ఒక్కరే అక్కడికి వెళ్లాల్సి ఉంది.. కానీ, తన సతీమణిపై వస్తున్న విమర్శలు గమనించి జేడీ వాన్స్ కూడా టూర్‌కు సిద్ధమయ్యారు. మరోవైపు ఈ పర్యటనలో డెన్మార్క్ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్కిటిక్ మంచు కరిగి ఉత్తర సముద్ర మార్గం అందుబాటులోకి వస్తే చైనా, జపాన్‌ల నుంచి సరకులను ఆ మార్గంలోనే అమెరికా, ఐరోపాలకు పంపవచ్చు. సూయజ్, పనామా కాలువలను ఆశ్రయించనక్కర్లేదు. దానివల్ల దూరం తగ్గి సమయం, రవాణా వ్యయం ఆదా అవుతాయి. ఉత్తర సముద్ర మార్గానికున్న రక్షణపరమైన ప్రాధాన్యమూ అంతా ఇంతా కాదు. చైనా, రష్యా నౌకాదళాలు 2022, 2023ల్లో ఆర్కిటిక్‌లోని బేరింగ్ జలసంధిలో సంయుక్త విన్యాసాలు జరిపాయి. గత అక్టోబరులో రష్యా, చైనా తీరరక్షక నౌకలు (కోస్ట్‌గార్డ్) సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి. ఆ రెండు దేశాలు ఆర్కిటిక్‌లో చేయీచేయీ కలిపి వనరుల అన్వేషణ, వాతావరణ మార్పులపై పరిశోధన, రక్షణ పరంగా ముందుకుసాగనున్నాయి. అమెరికా, నాటోలూ అదే పని చేయనున్నాయి. మంచు లేని ఆర్కిటిక్ ప్రాంతంలో రవాణా నౌకల సంచారం పెరిగిపోతుంది. అక్కడి అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు, అరుదైన లోహాలను తవ్వితీయడానికి పోటీ ముమ్మరమవుతుంది. భూగోళంపై అరుదైన లోహ నిక్షేపాల్లో 25శాతం గ్రీన్‌లాండ్‌లో పోగుపడ్డాయి.అందుకే ఆర్కిటిక్ ప్రాంతంలోని గ్రీన్‌లాండ్‌ను కొనాలని ట్రంప్ యోచిస్తున్నారు.

# ది మాస్టర్ మైండ్స్ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలి

**ప్రభుత్వా అనుమతి ఏడవ తరగతి వరకే అయినా పదవ తరగతి వరకు నడిపిస్తాం**

- ప్రభుత్వ అనుమతులు లేకుండా గల్లీ కో బడి
- విద్యార్హత లేని పాఠశాల ఇన్చార్జులు
- ఫీజుల కోసం విద్యార్థులను చిత్రహింసలు పెడుతున్న ది మాస్టర్ మైండ్స్
- ప్రభుత్వ అనుమతి ఉన్నది 7వ తరగతి వరకు నడుపుతున్నది మాత్రం 10వ తరగతి వరకు
- తనిఖీల కోసం వచ్చిన అధికారులకు ముడుపులు అందజేత..?
- ప్రభుత్వ నిబంధనలను పాటించని ది మాస్టర్ మైండ్స్ పాఠశాల
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పాఠశాల నిర్వహణ
- క్వాలిఫైడ్ టీచర్లు లేరు.. చదువుకోడానికి లైబ్రరీ లేదు
- ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉన్నాయి అంటే ఉన్నాయి అంతే..
- పాఠశాలలో విద్యార్థుల భద్రతకు భరోసా లేదు
- ఇరుకు గదుల్లో విద్యా బోధన
- స్కూల్ జోన్ బోర్డులు లేవు... ట్రాఫిక్ నిబంధనలు అంతకన్నా లేవు...



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న పీర్జాదిగూడ ది మాస్టర్ మైండ్స్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే ఉప్పల్ డిపో వద్ద గత 3 సంవత్సరాలుగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ అరకొరగా విద్యనందిస్తున్న ది మాస్టర్ మైండ్స్ పాఠశాలపై ఉన్నత విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ డిపో బంగారు మైసమ్మ ఆలయం వద్ద జనావాసాల మధ్య ఇరుకు రోడ్డులో సుమారు 3 సంవత్సరాలుగా ది మాస్టర్ మైండ్స్ పేరుతో పాఠశాల నడుస్తుంది. స్కూల్ ఎడ్యుకేషన్ జీవో ఎంఎస్ నెంబర్ 1 ప్రకారం ఎలాంటి ప్రభుత్వ నిబంధనలు లేవు. అదేవిధంగా విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. చదువుకుందామంటే సుశాలమైన లైబ్రరీ లేదు. ఆధునిక లేబరేటరీలు లేవు. ఎంతసేపు ఇరుకు గదుల్లోనే విద్యాబోధన. గల్లీకో పాఠశాలను ప్రారంభిస్తూ అరకొరగా విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తుంది. ఆ స్కూలు స్థాపించినప్పటి నుండి 3 సంవత్సరాలగా పదవ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు లేదు. కానీ అక్కడ చదివే విద్యార్థులను వేరే పాఠశాలల నుండి 10వ తరగతి పరీక్షలు రాయిస్తున్నారు. అంతేకాకుండా ఆ పాఠశాలలో ప్రభుత్వ నిబంధన ప్రకారం క్వాలిఫైడ్ టీచర్లు లేరు. ఒకవేళ విద్యాశాఖ అధికారులు తనిఖీల కోసం వచ్చినప్పుడు ముడుపులు అందజేస్తూ కాలం గడిపేస్తున్నారన్నా అనుమానం లేకపోలేదు...! శానిటేషన్ నిర్వహణ కూడా సరిగా లేదు. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు లేవు. కేవలం ధనార్జనే ధ్యేయంగా పాఠశాల నిర్వహణ ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో దండుకుంటున్నారని, పరీక్షలప్పుడు విద్యార్థులను చిత్రహింసలకు గురి చేస్తూ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చదువు మాత్రం అరకొరగా అందిస్తున్నారని ఎన్నిసార్లు చెప్పినా పాఠశాల యాజమాన్యం పట్టించుకోలేదని తల్లిదండ్రులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు.! ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం ఇటు వైపు కన్నెత్తి కూడా చూడరు. మరి పాఠశాల యజమాన్యం ముడుపులతో వారిని మేనేజ్ చేస్తున్నారా.? అనే అనుమానం తల్లిదండ్రుల్లో రేకెత్తిస్తుంది. కేవలం రంగురంగుల కరపత్రాలతో, మాయ మాటలతో అడ్మిషన్లను తీసుకుంటూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను, వారి భవిష్యత్తును నాశనం చేస్తుందనేది జగమెరిగిన సత్యం. పాఠశాల ముందు జీబ్రా క్రాసింగ్‌లు ఉండవు.. స్కూల్ జోన్ బోర్డులు ఉండవు.. పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్లు లేవు... పాఠశాల పై అంతస్తులలో తరగతులు విశాలంగా ఉండవు.. ఒక విధంగా చెప్పాలంటే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ పాఠశాల నిర్వహణ ఉంది అనటానికి ఉదాహరణ. కొన్ని కొన్ని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు ఏదో ఒకటి ఉల్లంఘిస్తారు. కానీ ముద్ర పాఠశాల యజమాన్యం ప్రభుత్వ నిబంధనలు ఏమీ పాటించకుండా అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ పేద ప్రజల రక్తాన్ని తాగుతూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ముద్ర పాఠశాలపై ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకొని తక్షణమే పాఠశాలను సీజ్ చేయాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

### 10వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు లేకుండానే కొనసాగింపు...?

పాఠశాల స్థాపించినప్పటి నుండి పదవ తరగతి వరకు గుర్తింపు లేకుండానే విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వేరే పాఠశాలల నుండి ఫార్వార్డ్ చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఈ మధ్యనే మండల విద్యాశాఖ అధికారి తనిఖీ కోసం వచ్చినప్పుడు ఇదిగో తెస్తాం... అదిగో తెస్తాం... అని మాయ మాటలు చెప్పి మమ అనిపిస్తున్నారు.

## భావ ప్రకటనా స్వేచ్ఛను రక్షించడం కోర్టుల విధి

### కాంగ్రెస్ ఎంపీ వీడియో కేసులో సుప్రీం వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** "ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే" అని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి వివాదాస్పద వీడియో పోస్ట్‌కు సంబంధించిన కేసుపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్య వ్యవస్థలో అంతర్భాగమని, దాన్ని రక్షించడం కోర్టుల విధి అని స్పష్టంచేసింది. అసలేం జరిగిందంటే.. గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి గతేడాది డిసెంబరులో తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. 46 సెకన్ల నిడివి ఉన్నా వీడియోలో ఇమ్రాన్ ఓ పెళ్లి వేడుక మధ్యలో నడిచివస్తుండగా ఆయనపై పూలవర్షం కురిసింది. బ్యాక్‌గ్రౌండ్ ఓ పద్యం వినిపించింది. అయితే, ఆ పద్యంలోని పదాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, మత విశ్వాసాలు, సామరస్యాన్ని, జాతి ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలోనే ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కాంగ్రెస్ ఎంపీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం.. గుజరాత్ పోలీసుల తీరుపై అసహనం వ్యక్తంచేసింది. ఎలాంటి నేరం లేకపోయినా.. అత్యుత్సాహం ప్రదర్శించారని వ్యాఖ్యానించింది.



ఈసందర్భంగా వాక్ స్వాతంత్ర్యంపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "కవిత్వం, నాటకం, సినిమాలు, వ్యంగ్యం, కళలు, సాహిత్యం వంటివి మనుషుల జీవితాన్ని మరింత అర్థవంతం చేస్తాయి. ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తీకరించే స్వేచ్ఛ లేనప్పుడు.. ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో.. విభిన్న అభిప్రాయాలను.. ప్రతివాదనలతో ఎదుర్కోవాలే తప్ప అణచివేతతో కాదు. ఒకవేళ ఆ వ్యాఖ్యలపై ఆంక్షలు విధించాల్సివస్తే.. అవి సహేతుకంగా ఉండాలే గానీ.. ఊహాజనితంగా కాదు. ఓ వ్యక్తి అభిప్రాయాలను ఎక్కువమంది వ్యతిరేకించినా సరే.. ఆ వ్యక్తి భావ ప్రకటనా హక్కును తప్పనిసరిగా గౌరవించాల్సిందే. వాక్ స్వాతంత్ర్యం అనేది ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. ప్రజల ప్రాథమిక హక్కును కాపాడటం న్యాయస్థానాల విధి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో కాంగ్రెస్ ఎంపీపై నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది.

## జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ నిజమైన రైతు నాయకుడు : సుప్రీం

**న్యూఢిల్లీ :** రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరసన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అంగీకరిస్తూ.. శుక్రవారం ఆయన నీటిని స్వీకరించి తన దీక్షను విరమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఖనౌరి, శంభు సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టి రహదారులను తెరిచినట్లు పేర్కొంది. రైతుల డిమాండ్ల సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన దల్లేవాల్‌ను అత్యున్నత న్యాయస్థానం ప్రశంసించింది. రైతులకు మంచి చేయాలనే ఆలోచన తప్ప.. ఆయనకు ఎలాంటి రాజకీయ అజెండా లేదని పేర్కొంది. అతడు నిజమైన కర్షక నాయకుడని కీర్తించింది. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన నివేదికను సమర్పించాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ఆదేశించింది. రైతుల ఫిర్యాదులను పరిశీలించి, అక్కడి స్థితిని తెలియజేసే నివేదికలను దాఖలు చేయాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ఉన్నతాధికార కమిటీని కోరింది. దల్లేవాల్‌కు వైద్యసహాయం అందించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించనందుకు పంజాబ్ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌పై విధించిన కోర్టు ధిక్కార చర్యలను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో




నవంబరు 26 నుంచి జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. దీంతో రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని సుప్రీం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని, కనీసం ఐవీ ఫ్లూయిడ్స్‌నైనా ఇచ్చేందుకు వీలుచిక్కడం లేదని పంజాబ్ ప్రభుత్వం పలుమార్లు నిస్సహాయత వ్యక్తం చేసింది. రైతు ప్రతినిధులతో చర్చలకు కేంద్రం అంగీకరిస్తే వైద్యసాయం పొందడం తనకు సమ్మతమేనని రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ఇటీవల ప్రకటించారు.



## ఎఫ్‌పీవీ ఆత్మాహుతి డ్రోన్లను పరీక్షించిన భారత్

**న్యూఢిల్లీ :** భారత్ డ్రోన్ టెక్నాలజీలో మరో అడుగు ముందుకేసింది. సైన్యంలోని 2వ (ఇండిపెండెంట్) ఆర్మర్డ్ బ్రిగేడ్ (ఫ్లూర్ డె లిస్) తొలిసారి అత్యాధునిక ఎఫ్‌పీవీ (ఫస్ట్ పర్సన్ వ్యూ) డ్రోన్లను పరీక్షించింది. యాంటీ ట్యాంక్ ఆయుధంతో ఈ డ్రోన్ లక్ష్యంపై విజయవంతంగా ఆత్మాహుతి దాడి చేసింది. దీనికి సంబంధించిన ప్రయోగం ఛండీగడ్‌లో జరిగింది. ప్రయోగ వీడియోను సైన్యం షేర్ చేసింది. ఆధునిక యుద్ధాల్లో ఎఫ్‌పీవీ డ్రోన్ల ప్రాధాన్యం పెరిగింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో వీటిని అత్యధికంగా వినియోగిస్తున్నారు. నిఘా, గస్తీ, లక్ష్యాలపై దాడికి, ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రానికి వీటిని వాడుతుంటారు. వీటి సైజు చిన్నదిగా ఉండటంతో.. దళాలు ఎక్కడికైనా తేలిగ్గా తరలించి ఆపరేషన్లను చేపట్టవచ్చు. ఈ డ్రోన్లు స్పష్టమైన వీడియో ఫీడ్‌ను నేరుగా ఆపరేటర్లకు పంపిస్తాయి. శత్రువుల పొజిషన్లు తెలియడంతో.. యుద్ధ క్షేత్రాన్ని సత్వరమే అంచనా వేసే అవకాశం లభిస్తుంది. ఇక చిన్న సైజులో ఉండటంతో.. వెంటనే వీటిని శత్రువులు గుర్తించి కూల్చే అవకాశాలు కూడా తక్కువ. వీటి ధర కూడా తక్కువకావడం కలిసొచ్చే అంశం. మనవరహిత విమానాలు, కాప్టర్ వంటి డ్రోన్లతో పోలిస్తే ఇవి చురుగ్గా కదులుతాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఇరుపక్షాలు వేల సంఖ్యలో ఈ శ్రేణి డ్రోన్లను మోహరించాయి. తాజాగా పరీక్షించిన డ్రోన్‌ను పూర్తిగా భారత్‌లోనే అభివృద్ధి చేశారు. దీనికి స్వదేశీ పరికరాలనే వాడినట్లు తెలుస్తోంది. ఫలితంగా ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేదు. ప్రత్యేకమైన ఆపరేషన్ల కోసం దీని వార్‌హెడ్‌ను డిజైన్ చేశారు.

## మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపం



**బ్యాంకాక్:** మయన్మార్‌లో శుక్రవారం భారీ భూంకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.7గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రకంపనల కారణంగా పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బ్యాంకాక్‌లో ప్రకంపనల తీవ్రత 7.3గా నమోదైంది. సెంట్రల్ మయన్మార్‌లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బ్యాంకాక్‌లో ప్రకంపనలు సంభవించాయి. పలు భవనాల్లో అలారమ్ మోగడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రకంపనల ధాటికి అనేక భవనాలు ఊగిపోయాయి. ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు, మయన్మార్‌లోనూ అనేక భవనాలు ధ్వంసమైనట్లు తెలిసింది. అయితే.. భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

# సొంతగడ్డపై చిత్తుగా ఓడిన చెన్నై

## బెంగళూరుకు రెండో విజయం



**చెన్నై:** చెపాక్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అదరగొట్టింది. చెన్నై సొంతగడ్డపై 17 ఏళ్ల తర్వాత ఆర్సీబీ విజయం సాధించింది. 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులకే పరిమితం అయింది. దీంతో ఆర్సీబీ 50 పరుగుల తేడాతో గెలుపొందింది. చెన్నై టీమ్‌లో రచిన్ రవీంద్ర (41: 31 బంతుల్లో 5 ఫోర్లు) టాప్ స్కోరర్. రాహుల్ త్రిపాఠి (5), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (0), దీపక్ హుడా (4), సామ్ కరన్ (8), శివమ్ దూబే (19), అశ్విన్ విఫలమయ్యారు. ధోనీ (30నా), జడేజా (25) రాణించారు. బెంగళూరు బౌలర్లలో జోష్ హేజల్ వుడ్ 3, యశ్ దయాల్ 2, లివింగ్‌స్టోన్ 2 వికెట్లు తీయగా, భువనేశ్వర్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (51, 32 బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సులు) అర్ధశతకంతో చెలరేగాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (32, 16 బంతుల్లో 5ఫోర్లు,1సిక్సు), విరాట్ కోహ్లి (31, 30 బంతుల్లో 2ఫోర్లు, 1సిక్సు) శుభారంభాన్నిచ్చారు. తొలి ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ వరుసగా 2 బౌండరీలు బాదాడు. తర్వాతి ఓవర్లో మరో 2 ఫోర్లు సహా ఓ సిక్సర్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. జోరు మీదున్న ఈ జోడీని నూర్ అహ్మద్ విడగొట్టాడు. ఐదో ఓవర్ చివరి బంతికి ధోనీ మెరుపు వేగంతో ఫిల్‌సాల్ట్‌ను స్టంపౌట్ చేశాడు. అక్కడికి మూడు ఓవర్ల వ్యవధిలోనే వన్ డౌన్‌లో వచ్చిన పడిక్కల్ (27) అశ్విన్ బౌలింగ్‌లో గైక్వాడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో స్థానంలో వచ్చిన పటీదార్‌తో కలిసి.. విరాట్ కోహ్లి ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశాడు. ఓ వైపు పటీదార్ వరుస బౌండరీలు బాదుతుంటే కోహ్లి సహకారం అందించాడు. ఈ క్రమంలో జట్టు స్కోర్ 117 పరుగుల వద్ద కోహ్లి ఔటయ్యాడు. అహ్మద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కోహ్లి.. అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం స్వల్ప వ్యవధిలో పటీదార్‌ను పతిరన ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లివింగ్ స్టోన్ (10), జితేశ్ శర్మ (12) పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. చివర్లో టిమ్ డేవిడ్ (22బీ 8 బంతుల్లో 1ఐ4, 3ఐ6) హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడడంతో ఆర్సీబీ భారీ స్కోర్ చేసింది. నూర్ అహ్మద్ 3, పతిరన 2, ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ తీశారు.



# 'రోడ్'పై మ్యాచ్‌లు..

## బౌలర్ల కాన్ఫిడెన్స్‌ను చంపొద్దు : మైకెల్ వాన్

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు షాక్ తగిలింది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన ఎస్‌ఆర్‌హెచ్ రెండో మ్యాచ్‌లో మాత్రం 200 మార్క్‌ను తాకలేదు. లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసిన ఇదే 'ఉప్పల్ పిచ్'పై హైదరాబాద్ బౌలర్లు మాత్రం తేలిపోయారు. గతంతో పోలిస్తే బ్యాటింగ్‌లోనూ ఎస్‌ఆర్‌హెచ్ తన స్థాయికి తగ్గ పరుగులు చేయలేకపోయింది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌పై 200 స్కోరు కూడా సరిపోదని.. ఇలాంటి ట్రాక్‌లపై ఎస్‌ఆర్‌హెచ్ దూకుడైన ఆటతీరు ఆ జట్టు బౌలర్ల ఆత్మవిశ్వాసం దెబ్బతీస్తోందని మాజీ క్రికెటర్ మైకెల్ వాన్ వ్యాఖ్యానించాడు. ఈ సీజన్‌లోని రెండు మ్యాచుల్లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక బౌలర్లు షమీ, కమిన్స్ భారీగా పరుగులు ఇచ్చినట్లు వాన్ గుర్తు చేశాడు. 'రోడ్'ను తలపించే పిచ్ వల్లే ఇలా జరిగిందని పేర్కొన్నాడు. "ఎప్పుడైనా సరే మనం హైదరాబాద్ బ్యాటింగ్, పవర్ హిట్టింగ్ గురించి మాట్లాకుంటూనే ఉంటాం. భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి తెచ్చింది. అయితే, ఈ సందర్భంగా సొంత బౌలర్ల ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కూడా మేనేజ్‌మెంట్‌పై ఉంది. ప్రత్యర్థి బ్యాటర్లు కూడా వీరి బౌలింగ్‌లో ఎక్కువగానే పరుగులు రాబట్టారు. రోడ్ వంటి పిచ్‌పై బౌలింగ్ చేయడం సులువేం కాదు. వారి గణాంకాలను చూస్తేనే అర్థమైపోతుంది. లఖ్‌నవూపై కమిన్స్ ఫర్వాలేదనిపించాడు. కానీ, అంతకుముందు రాజస్థాన్‌పై నాలుగు ఓవర్లలో 60 పరుగులు ఇచ్చాడు. జంపా, షమీ.. ప్రతిఒక్కరూ భారీగా పరుగులు ఇచ్చారు. అందుకే, బౌలింగ్ విషయంలో సన్‌రైజర్స్ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి" అని వాన్ హెచ్చరించాడు.

**ఒకే స్టైల్‌లో క్రికెట్ ఆడటంపై..** "నేను ఇప్పటివరకు పెద్ద టోర్నీల్లో ఒకే స్టైల్‌లో క్రికెట్ ఆడిన టీమ్‌ను చూడలేదు. అయితే, సన్‌రైజర్స్ విషయంలో నేను కాస్త ఆందోళనకు గురవుతున్నా. ఇప్పుడు కేవలం ఒక్క స్టైల్ ఆఫ్ క్రికెట్‌ను ఆడాలని చూస్తోంది. గేర్లు మారుస్తూ ఉండాలి. పరిస్థితులకు తగినట్లుగా ఆడాలి. ప్రతిసారి దూకుడుగా ఆడటం కుదరదు. లఖ్‌నవూతో మ్యాచ్‌ను గమనిస్తే.. వారు కొన్ని పరుగులు తక్కువ చేశారు. దానికి కారణం మరీ దూకుడుగా ఆడటమే. కాస్త స్మార్ట్‌గా ఆడి ఉంటే కనీసం 220-230 పరుగులు చేసే అవకాశం ఉండేది" అని మైకెల్ వాన్ తెలిపాడు.

# 'సూపర్ బాల్'కూ అవార్డు ఇస్తే బాగుండు : అశ్విన్

ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలివారం కూడా ముగియకుండానే ఇప్పటికే మూడు మ్యాచుల్లో 230ం స్కోర్లు నమోదయ్యాయి. గతేడాది కూడా ఇదే దూకుడు కనిపించింది. ఇటీవల టీ20ల్లో 200 పరుగుల స్కోరు ఉన్నా విజయం సాధిస్తామనే నమ్మకం లేదు. బ్యాటర్లకు పూర్తి అనుకూలంగా మారిన పిచ్‌లపై ఎవరైనా బౌలర్ అద్భుతంగా బంతులేస్తే వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించేలా అవార్డు ఉంటే బాగుంటుందని సీఎస్కే ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు. "ఐపీఎల్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో చాలా అవార్డులకు చోటు కల్పించారు. దాదాపు 10 అవార్డులను అందజేస్తున్నట్లుంది. ఇరు జట్ల ఆటగాళ్లూ చెరో సగం అందుకొంటున్నారు. కానీ, ఎవరైనా బౌలర్ అద్భుతమైన డెలివరీ సంధిస్తే.. లేకపోతే నాణ్యమైన ఓవర్ వేస్తే వారికి కనీసం ఒక్క అవార్డు లేదు. ఓవరాల్‌గా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బౌలర్‌కు వస్తే తప్ప.. ఇలా సూపర్ స్ట్రైకర్, సూపర్ ఫోర్లు, సూపర్ సిక్స్‌లకు ఇచ్చినట్లుగా 'సూపర్ బాల్'కూ ఇస్తే బాగుంటుంది. ఒకసారి ఫాస్టెస్ట్ బాల్‌కు అవార్డు ఇచ్చినట్లు గుర్తు. ఆ బంతిని సిక్స్‌గా కొట్టినా సరే అవార్డు మాత్రం వచ్చింది. అలాకాకుండా ఉత్తమ బంతి అంటే బ్యాటర్ ఎదుర్కోవడానికి ఇబ్బందిపడిన దానికి ఓ అవార్డు ఉంటే బాగుంటుంది." అని వెల్లడించాడు.



### నా దృష్టిలో అతడే అత్యంత విలువైన ఆటగాడు..


పంజాబ్ – గుజరాత్ మ్యాచ్ పైనా తన విశ్లేషణను అశ్విన్ వెల్లడించాడు. శ్రేయస్ అయ్యర్ (97నా)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వచ్చినప్పటికీ.. అత్యంత విలువైన ఆటగాడు మాత్రం విజయ్‌కుమార్ వైశాఖ్ అని అశ్విన్ తెలిపాడు. "ఇంపాక్ట్‌గా వచ్చిన వైశాఖ్ తన తొలి రెండు ఓవర్లలో కేవలం పది పరుగులే ఇచ్చి గుజరాత్‌ను కట్టడి చేశాడు. 15 ఓవర్లకు 169/2 స్కోరుతో ఉన్నప్పుడు బౌలింగ్‌కు వచ్చిన వైశాఖ్ కట్టడి చేయడం వల్లే పంజాబ్ విజయం సాధించింది. తొలుత బ్యా టింగ్ చేసిన శ్రేయస్‌కు కాస్తలో సెంచరీ మిస్ అయింది. అతడి ఇన్నింగ్స్ కీలకమే కానీ.. గుజరాత్ పైచేయి సాధించ కుండా చేయడంలో వైశాఖ్‌దే కీలక పాత్ర. అందుకే, అతడిని అత్యంత విలువైన ప్లేయర్‌గా పేర్కొంటా" అని అశ్విన్ వెల్లడించాడు.

# బీఎస్ఈ షేర్లు 17% జంప్..

ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ షేర్లు నేడు ట్రేడింగ్ సెషన్‌లో పరుగులు పెట్టాయి. ఎఫ్అండ్ఓ కాంట్రాక్ట్‌ల గడువు రోజును మార్చాలనే నిర్ణయాన్ని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడమే ఇందుకు కారణం. దీంతో బీఎస్ఈ షేర్లు ఇంట్రాడేలో ఏకంగా 17 శాతం పెరిగాయి. ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్.. వారాంతపు, నెలవారీ, త్రైమాసిక కాంట్రాక్ట్‌ల గడువును గురువారం నుంచి సోమవారానికి మార్చాలని ఎన్ఎస్ఈ తొలుత నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. గడువు తేదీని మార్చే ప్రణాళికను కొనసాగించవద్దని, ప్రస్తుతానికి యథాతథస్థితిని కొనసాగించాలని సూచించింది. దీంతో తాజా ప్రణాళికను వాయిదా వేయాలని ఎన్ఎస్ఈ నిర్ణయించుకుంది. ఈ ప్రకటనతో బీఎస్ఈ షేర్లు లాభాల బాట పట్టాయి. 12:45 గంటల సమయంలో ఈ షేర్లు 16.6 శాతం లాభంతో రూ.5,466 వద్ద ట్రేడవుతున్నాయి. ఎఫ్అండ్ఓ కాంట్రాక్ట్‌ల గడువు సోమవారానికి మార్చాలనే ప్రణాళికను ఎన్ఎస్ఈ ప్రకటించిన సమయంలో బీఎస్ఈలో లిక్విడిటీ తగ్గిపోతుందనే భయాందోళనలు నెలకొన్నాయి. ఈ కారణంగా ఆ రోజు ట్రేడింగ్ సెషన్‌లో షేర్లు 9 శాతం కుప్పకూలాయి. ప్రస్తుతం బీఎస్ఈ కాంట్రాక్ట్ గడువు మంగళవారం ఉండగా.. ఎన్ఎస్ఈ ఎక్స్‌పైరీ గురువారంగా ఉంది.

# ర్యాపిడో 'పింక్'..

## 2 లక్షల మంది మహిళా రైడర్లతో..




ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో మహిళలకు ఉపాధి అవకాశాలు అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన 'పింక్ మొబిలిటీ' సేవల్ని విస్తరిస్తోంది. దీంతో దేశవ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని సృష్టించడమే తమ లక్ష్యంగా పేర్కొంది. మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సౌలభ్యం కల్పించేందుకు ఈ చొరవ చూపినట్లు కంపెనీ వెల్లడించింది. రానున్న మూడేళ్లలో దీనికి సంబంధించిన ప్రణాళికల్ని అమలు చేయనుంది. పింక్ మొబిలిటీ విస్తరణ కోసం ఆజాద్ ఫౌండేషన్, శాఖా కన్సల్టింగ్ వింగ్స్‌తో ర్యాపిడో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ త్రిముఖ ఒప్పందం ద్వారా నిరుపేద మహిళలకు ప్రొఫె షనల్ డ్రైవింగ్ నైపుణ్యాలను అందించడం, వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం, రవాణా రంగంలో ఆర్థిక సాధికారతను ప్రోత్సహించనుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో మహిళలకు నెలకు గరిష్ఠంగా రూ.25వేల వరకు స్థిరమైన ఆదాయం పొందేలా దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను సమకూర్చుతుందని కంపెనీ తెలిపింది. అవకాశాలను సృష్టించడంతో పాటు వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఈ సేవలు దేశంలోని పలు నగరాల్లో అందుబాటులో ఉండగా, త్వరలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు ర్యాపిడో తెలిపింది. 'పింక్ మొబిలిటీ' కింద మహిళా కెప్టెన్లు నడిపే ప్రత్యేక వాహనాలు మహిళా ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి. ఈ వాహనాలు ఆటో రిక్షాలు, బైక్ టాక్సీలతో సహా వివిధ రకాలుగా ఉంటాయని సంస్థ పేర్కొంది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు..

## ఈ ఏడాది 5% లాభాలు పంచిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజును దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగించాయి. సెన్సెక్స్ 191 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 72 పాయింట్లు కోల్పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రకటన చేయనున్న (ఏప్రిల్ 2) వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటీ, ఆటోమొబైల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపించింది. సెన్సెక్స్ ఉదయం 77,690.69 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,606.43) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,185.62– 77,766.70 మధ్య కదలాడింది. చివరికి 191.51 పాయింట్లు నష్టంతో 77,414.92 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 72.60 పాయింట్ల నష్టంతో 23,519.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3077 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) చివర్లో సూచీలు నష్టాలు ఎదు ర్కొన్నప్పటికీ.. మదుపర్లకు మాత్రం 5 శాతానికి పైగా రెండు సూచీలు ప్రతిఫలాన్ని ఇచ్చాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 7.48 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 5.4 శాతం చొప్పున లాభాలను నమోదు చేశాయి. శని, ఆదివారాలతో పాటు రంజాన్ సందర్భంగా సోమవారం (మార్చి 31) మార్కెట్‌కు సెలవు.

# బ్రిటన్‌కు గుడ్‌బై చెప్పే ఆలోచనలో లక్ష్మీ మిత్తల్



ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీమిత్తల్ బ్రిటన్‌కు గుడ్‌బై చెప్పనున్నారా..? మూడు దశబ్దాలుగా అక్కడే నివసిస్తోన్న ఆయన కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ దేశాన్ని వీడాలని అనుకుంటున్నట్లు సమాచారం. ఆయనతోపాటు పలువురు సంపన్నులు కూడా అదే యోచనలో ఉన్నారు. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనా లు పేర్కొన్నాయి. నాన్-డోమ్ పన్ను విధానాన్ని రద్దు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పన్ను విధానం కింద యూకే నివాసితులు విదేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్ ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 226 సంవత్సరాల నుంచి ఈ పన్ను వెసులుబాటు ఉంది. అయితే ఇప్పుడు ఈ విధానాన్ని తొలగిం చాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఇది అక్కడ నివాసం ఉంటున్న సంపన్నులను ఆలోచనలో పడేసింది. వారు యూకేను వీడి.. పన్ను మినహాయింపులకు స్వర్గధామంగా ఉండే ఇతర దేశాలపై దృష్టిసారించేలా చేసింది. ఈ జాబితాలో ఉన్న స్టీల్ దిగ్గజం లక్ష్మీ మిత్తల్ ఈ ఏడాదిలోపు తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని మీడియా కథనం పేర్కొంది. సండే టైమ్స్ రిచ్ లిస్ట్ గత ఏడాది విడుదల చేసిన జాబితా ప్రకారం మిత్తల్ సంపద 14.9 బిలియన్ పౌండ్లుగా ఉంది. ఆ జాబితాలో ఆయన ఏడో స్థానంలో నిలిచారు. ఐరోపా, అమెరికాలో ఆయనకు ఎన్నో విలువైన ఆస్తులు ఉన్నాయి. లండన్‌లోని ప్రఖ్యాత కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్ ప్రాం తంలో ఆయనకు ఒక విలాస భవంతి ఉంది. ప్రస్తుతం ఆయన దుబా య్‌లో పెట్టుబడులు పెడుతున్నారని ఆ కథనం వెల్లడించింది. ప్రస్తుతం యూకేలో పన్ను మినహాయింపులు రద్దు చేయడంతో.. ఇప్పుడు లక్ష్మీ మిత్తల్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, స్విట్జర్లాండ్, ఇటలీలో ఏదో ఒకదానికి మకాం మార్చాలనుకుంటున్నారని తెలుస్తోంది. స్టీల్ ఉత్పత్తిలో ఆర్సెలార్ మిత్తల్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. 24 బిలియన్ యూరోల విలువైన ఆ సంస్థలో మిత్తల్ కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. 2021లో లక్ష్మీమిత్తల్ సీఈఓగా దిగిపోవడంతో.. ఆయన కుమారుడు ఆదిత్య మిత్తల్ ఆ బాధ్యతలు స్వీకరించారు. అయితే సంపన్నులు దేశాన్ని వీడటం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# జీతాల పెంపుపై గూగుల్ ఉద్యోగుల అసంతృప్తి

ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్‌లో పనిచేసే ఉద్యోగులు జీతాల పెంపుపై అసంతృప్తిగా ఉన్నారు. వారు ఆశించిన స్థాయిలో ఈ సంవత్సరం జీతాల పెంపు లేకపోవడమే ఇందుక్కారణంగా తెలుస్తోంది. ఈ అంశాన్ని సంస్థ ఉద్యోగులు ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ తన కథనంలో పేర్కొంది. మార్చి 25న జరిగిన సమావేశంలో జీతాల పెంపు విషయం చర్చకు వచ్చింది. ఇందులో చాలామంది ఉద్యోగులు తాజా పెంపుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కంపెనీ ఆర్థిక సామర్థ్యం మెరుగ్గా ఉన్నప్పటికీ 2025 సంవత్సరానికి గానూ ప్యాకేజీని స్వల్పంగా పెంచినట్లు తెలిపారు. ముఖ్యంగా జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో గణనీయమైన జీతాల పెరుగుదల లేకపోవడంతో నిరాశ చెందారు. ఈవిషయంపై గూగుల్ వైస్ ప్రెసిడెంట్ జాన్ కేసీ స్పందించారు. 80 శాతం కంటే ఎక్కువమంది ఉద్యోగులు 2025లో తమ వేతనాల్లో గత ఏడాదితో పోలిస్తే పెరుగుదల చూశారని తెలిపారు. అయితే నాన్-టెక్నికల్‌తో పాటు కొన్ని విభాగాల్లోని వాళ్లు మాత్రం తక్కువ ప్యాకేజీలు అందుకున్నట్లు ఆయన అంగీకరించారు. తక్కువ జీతాల పెంపును ఎదుర్కొన్న ఉద్యోగులకు మెరుగైన వేతనం చెల్లించాలని గూగుల్ కోరుకుంటోందని జాన్ కేసీ పేర్కొన్నారు. అయితే అధిక పనితీరు కనబరిచిన వారిని ప్రోత్సహించేలా ఈ పెంపు ఉంటుందని తెలిపారు. గూగుల్ జీతాల పెంపు గత ఏడాదిలో పెంచిన 8-10 శాతం జీతంతో పోలిస్తే కేవలం 3 శాతం మాత్రమే పెంచినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉండగా.. గూగుల్ గతేడాది డిసెంబర్‌లో పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించింది. మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఏఐ సంస్థల నుంచి పోటీ పెరుగుతున్న వేళ తన సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# రేసు నుంచి సల్మాన్‌ఖాన్ అవుట్

## అట్లీతో అల్లుఅర్జున్ సినిమా

అట్లీతో ఇప్పట్లో మూవీ చేయడం లేదని స్పష్టం చేశారు. అది భారీ బడ్జెట్ సినిమా అని అందుకే ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని చెప్పారు. కానీ భవిష్యత్తులో కచ్చితంగా అట్లీతో సినిమా ఉంటుందని అన్నారు. సల్మాన్ ఖాన్ ప్రకటనతో బన్నీ అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్ తో ప్రస్తుతం సినిమా లేనందున అట్లీ అల్లు అర్జున్ కాంబోలో సినిమా సెట్స్ పైకి వెళ్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నిజానికి బన్నీ పుష్ప తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాల్సి ఉంది. అయితే అది భారీ బడ్జెట్ మైథలాజికల్ మూవీ కావడంతో మూవీ పట్టాలెక్కేందుకు ఇంకా టైం పట్టే ఛాన్సుంది. ఈ గ్యాప్‌లో అట్లీతో మూవీ చేయాలని అల్లు అర్జున్ భావిస్తున్నట్లు సమాచారం. అట్లీ, అల్లు అర్జున్ కాంబోలో తెరకెక్కనున్న సినిమాకు ఇప్పటికే కథ ఓకే అయిందని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఉగాది రోజున దీనికి సంబంధించి క్లారిటీ వచ్చే ఛాన్సుంది. ఒకవేళ వీరిద్దరి కాంబోలో సినిమా వస్తే పాన్ ఇండియా రేంజ్ లో మరో హిట్ పక్కా అని బన్నీ ఫ్యాన్స్ అంటున్నారు.

# విజయాలు సాధించడమే సక్సెస్ కాదు : సమంత

గత కొన్ని రోజులుగా సిడ్నీలో పర్యటిస్తున్నారు నటి సమంత. ఇటీవల అక్కడ జరిగిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ సిడ్నీలో ఆమె పాల్గొన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ కెరీర్‌లో రాణించడంపై మాట్లాడారు. సక్సెస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సక్సెస్ అంటే విజయాలు సాధించడం మాత్రమే కాదని.. సామాజిక పట్టింపులు, కట్టుబాట్ల నుంచి విముక్తి పొందడమంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా జీవించడం, మూస ధోరణి భావనలను సవాలు చేయడం గురించి ఆమె హైలైట్ చేస్తూ మాట్లాడారు. "నా దృష్టిలో సక్సెస్ అంటే స్వేచ్ఛ, స్వతంత్రం. నేను విజయవంతమయ్యానని ఇతరులు చెప్పేవరకు వేచి ఉండను. సక్సెస్ అంటే.. మనకు నచ్చినవిధంగా జీవించడం అలాగే, మన అభిరుచికి తగ్గట్టుగా పనులు చేయడం. అంతేకానీ, మహిళలను ఒకచోట బంధించి ఇది చేయాలి? ఇది చేయకూడదు అని చెప్పడం కాదు. నిజ జీవితంలో ఎన్నోరకాల పాత్రలను పోషిస్తూ అన్నింటిలో సమర్థంగా రాణించగలగడమే సక్సెస్" అని సమంత తెలిపారు. కెరీర్ పరంగా తాను నిర్మాతగా మారడంపైనా ఆమె మాట్లాడారు. నూతన టాలెంట్, అద్భుతమైన కథలను ప్రేక్షకులను అందించేందుకే తాను నిర్మాణరంగంలోకి అడుగుపెట్టానని అన్నారు. సిడ్నీ పర్యటనలో భాగంగా ఆమె ఇటీవల అక్కడి యువతతో మాట్లాడారు. తాను కన్న కలల్లో ఒకటి నెరవేరలేదన్నారు. చదువుకునే రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లాలని.. సిడ్నీ యూనివర్సిటీలో చదువుకోవాలని తాను అనుకున్నానని కాకపోతే అది నెరవేరలేదని ఆమె చెప్పారు. అనుకోకుండా తాను సినిమాల్లోకి అడుగు పెట్టానని తెలిపారు. నటిగా ఇంతమంది అభిమానం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ కలల సాకారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. సినిమాల విషయానికి వస్తే.. సమంత ఇటీవల 'సిటడెల్.. హనీ బన్నీ'తో అలరించారు. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్' అనే యాక్షన్ సిరీస్ కోసం వర్క్ చేస్తున్నారు.





# వెంకటేశ్‌తో హరీశంకర్ సినిమా

ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించాడు టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్. దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ తన కెరీర్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న ఈ స్టార్ హీరో, తన తదుపరి చిత్రాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్ వివిధ దర్శకుల నుంచి కథలు వినడంలో బిజీగా ఉన్నాడని సమాచారం. ఈ సందర్భంలోనే ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ కూడా ఓ కథను వెంకటేష్‌కు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ కథ వెంకీకి నచ్చడమే కాకుండా, నిర్మాత సురేష్ బాబు కూడా దీన్ని ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌ను వెంకటేష్ ఖరారు చేసినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం వెంకటేష్ కెరీర్‌లో 77వ సినిమాగా రానున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ సర్కిల్స్‌లో టాక్ నడుస్తోంది. సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ సినిమా తర్వాత హరీశ్ శంకర్‌కి అసలు హిట్ లేదన్న విషయం తెలిసిందే. దువ్వాడ జగన్నాథం సినిమా కలెక్షన్స్ సాధించిన కూడా ఫ్లాప్‌గా నిలిచింది. ఇక రీసెంట్‌గా మిస్టర్ బచ్చన్ అంటూ వచ్చి డిజాస్టర్‌ను అందుకున్నాడు. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసి మీదా ఉన్న హరీశ్ శంకర్ ప్రస్తుతం వెంకీమామ కోసం సాలిడ్ కథ రెడీ చేసినట్లు తెలుస్తుంది.

# రూ.700 కోట్ల బడ్జెట్‌తో హృతిక్‌రోషన్ సినిమా



బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. ఈ విషయాన్ని అతడి తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంచైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ.. హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దుగ్గూ (హృతిక్ రోషన్) 25 సంవత్సరాల క్రితం నిన్ను నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా నేను కలిసి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాం. దర్శకుడిగా నీ ప్రయాణంలో నువ్వు అనేక విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మా ప్రతిష్ఠాత్మక చిత్రం 'క్రిష్ 4'కి నీవు దర్శకత్వం వహిస్తుండటం సంతోషంగా ఉందంటూ రాకేష్ రోషన్ రాసుకొచ్చాడు. ఈ విషయం తెలిసిన బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.



# ఇప్పట్లో ప్రభాస్ పెళ్లి లేనట్టే

సోషల్ మీడియాలోనూ ప్రభాస్ పెళ్లి గురించి రకరకాల పోస్టులు దర్శనమిచ్చాయి. వీటిని చూసిన చాలామంది ప్రభాస్ పెళ్లి వార్తలు నిజమేననుకున్నారు. అయితే వాటిలో ఎలాంటి నిజం లేదని తేలిపోయింది. ప్రభాస్ పెళ్లి వార్తలపై ఆయన టీమ్ స్వయంగా స్పందించింది. ఇలాంటి అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని అభిమానులకు విజ్ఞప్తి చేసింది. దీంతో ప్రభాస్ పెళ్లి వదంతులకు చెక్ పడినట్టైంది.




# విజయదేవరకొండతో కీర్తిసురేష్ సినిమా

'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న కీర్తి సురేష్ ఈ మధ్య తెలుగులో కనిపించడం లేదు. గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో హోమ్లీగా కనిపించే ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లోకి వెళ్లగానే తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. బేబీ జాన్‌తో ఆమె గ్లామర్‌కి నార్త్ జనాలు ఫిదా అయిపోయారు. దీంతో సినిమా డిజాస్టర్ అయినా కీర్తి మాత్రం మంచి మార్కులే కొట్టేసింది. పెళ్లి తర్వాత దూకుడి పెంచిన కీర్తి మళ్లీ టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో ఆమెకు వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నా యి. నితిన్, వేణు యెల్దండి కాంబినేషన్లో దిల్ రాజు నిర్మిస్తోన్న 'ఎల్లమ్మ'లో కీర్తి సురేష్ నటిస్తోందంటూ వార్తలొస్తున్నాయి. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా సాయిప ల్లవిని అడిగితే డేట్స్ అడ్జట్స్ లేక నో చెప్పేసిందట. దీంతో ఆమె ఆఫర్ కీర్తి వద్దకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తు న్నాయి. దీనిపై యూనిట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. తాజాగా ఈ భామ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ కొట్టేసింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీని తర్వాత 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' మూవీ చేయనున్నాడు. దీనికి దిల్ రాజు నిర్మాత. ఈ ప్రాజెక్టులో కీర్తి సురేష్‌ని తీసుకుంటే కాంబినేషన్ అదిరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. ఇక సుహాస్ పక్కన 'ఉప్పు కప్పురంబు' మూవీ ఇప్పటికే కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుని 'మహానటి'గా కీర్తించబడు తోన్న కీర్తి సురేష్ ఇకపై కమర్షియల్ బాటలో నడుస్తూ గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని తెగ ఆరాటప డుతోందట. చాలామంది హీరోయిన్లు కెరీర్ తొలినాళ్లలో గ్లామర్ పాత్రలు చేసి పెళ్లి తర్వాత హోమ్లీగా కనిపించ డానికి ప్రయత్నిస్తారు. కీర్తి మాత్రం ఇన్నాళ్లూ కాస్త పద్ధతిగా కనిపించి పెళ్లి తర్వాత గ్లామర్ ట్రీట్ ఇవ్వడానికి తెగ కష్టపడుతోంది.



# పూరీ జగన్నాథ్ చిత్రానికి నో చెప్పా : రకుల్‌ప్రీత్ సింగ్

వివాహం తర్వాత కూడా కెరీర్‌లో రాణిస్తున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారామె. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మోడలింగ్ రోజుల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి తనకు పెద్దగా ఏమీ తెలియదన్నారు. తొలి సినిమా అవకాశం వచ్చినప్పుడు ఈ పరిశ్రమ గురించి తెలియక ఆసక్తి చూపించలేదన్నారు. పూరీ జగన్నాథ్ చిత్రానికి కూడా నో చెప్పానని వెల్లడించారు. "కాలేజ్‌లో చదువుకుంటూనే మోడలింగ్ చేశా. ఆ సమయంలో నా ఫొటోలు చూసి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి తొలి సినిమా అవకాశం వచ్చింది. నిజం చెప్పాలంటే అప్పట్లో నాకు దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పరిచయం లేదు. అక్కడి చిత్రాలూ చూడలేదు. దాంతో అవకాశం వచ్చినప్పుడు మొదట ఎంతో ఆలోచించా. వాళ్లు నా తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో 'గిల్లి'లో యాక్ట్ చేశా. సినిమా షూటింగ్ వల్ల చదువు విషయంలో కాస్త సమస్యలు తలెత్తాయి. తొలి చిత్రంతోనే నటన ఎంతగానో నచ్చింది. చదువు పూర్తి చేసి సినిమాల్లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నా" "తొలి సినిమా విడుదలయ్యాక పూరీ జగన్నాథ్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన 70 రోజులు డేట్స్ అడిగారు. దానికి నేను అంగీకరించలేదు. కాలేజ్ ఉందని.. కావాలంటే నాలుగు రోజులు ఇస్తానన్నట్లు చెప్పాను. ఎందుకంటే, సినిమాల్లో ఎన్ని రోజుల వర్క్ ఉంటుందనేది అప్పట్లో నాకు పెద్దగా తెలియదు కాబట్టి అలా మాట్లాడాను. నా ఇబ్బందిని ఆయన అర్థం చేసుకున్నారు. అది మాత్రమే కాదు.. ఆ సమయంలో ఎన్నో సినిమాలు వదులుకున్నా" అని రకుల్ తెలిపారు. పెళ్లి గురించి మాట్లాడుతూ.. "జీవితంలో ప్రతిఒక్కరికి హార్ట్ బ్రేక్స్ ఉంటాయి. వాటినుంచే జీవితానికి సంబంధించిన ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశా. ఒక వ్యక్తిని బాగా నమ్మి.. విడిపోతే దానంత భయంకరమైన విషయం మరొకటి ఉండదు. ప్రేమ చాలా గొప్పది. నీ జీవితంలో ఏదైనా లోటు ఉంటే అది వేరే వ్యక్తి పూర్తి చేస్తాడని ఎప్పుడూ అనుకోకూడదు. నీ జీవితానికి సంబంధించి నువ్వే అన్నీ అని తెలుసుకోవాలి. అదే విషయాన్ని జాకీని కలిసినప్పుడు మేము మాట్లాడుకున్నాం. మా అభిప్రాయాలు కలిశాయి. కొంతకాలానికి మేమిద్దరం ఒక్కటయ్యాం. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం" అని ఆమె వివరించారు.



# కొత్త లుక్స్‌తో హల్‌చల్ చేస్తున్న అనన్యపాండే

బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్. అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది. లైగర్ ఈ బ్యూటీ తొలి తెలుగు చిత్రం. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించింది, కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత ఈ భామ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించింది. గెహరాయియా, ఖో గయే హమ్ కహా, కంట్రోల్, కాల్ మీ బే వంటి ప్రాజెక్ట్‌లలో ఆమె నటన ప్రశంసలు అందుకుంది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనన్య భారీ ఫాలోయింగ్ ఉంది. వ్యక్తిగత జీవితంలో ఆమె పలుమార్లు ప్రేమ వ్యవహారాల గురించి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా నటుడు ఆదిత్య రాయ్ కపూర్‌తో ఆమె రిలేషన్‌షిప్ గురించి చర్చలు జరిగాయి, అయితే వారు విడిపోయినట్లు వార్తలు వచ్చాయి. అనన్య తన నటనతో పాటు ఫ్యాషన్ సెన్స్‌తో కూడా యువతలో పాపులర్ అయ్యింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com